Regd.No.PMG/VJ/13-20-3 RNI No.32106/76
Licence to post without pre-payment Memo No.Tech 31 pre-pymt / Spandana dtd at VJA-10, the 2-1-03



"దిక్కులేని వారందరికి న్యాయము జరుగునట్లు న్యాయము జరుగునట్లు నీ నోరు తెరువుము". సామెతలు *31.9.*

కీ.శే. శ్రీమతి దబ్బా లలిత కుమారి గారి స్మృతికి చిహ్నంగా వారి కుమారుడు సోదరులు ప్రకాశ్ గారు క్రిస్మస్ సందర్భంగా 100 మంది పిల్లలకు నూతన వస్త్రాలు బహూకరించారు

"తండ్రి లేని వారి యెడల వాత్సల్యము చూపువాడవు నీవే". హోషేయ *14.3*

# లిటిల్ ఏంజల్స్ హోమ్

## అనాధ, పేద పిల్లల ఆశ్రమము



శ్రేష్టమైన ఈ చిన్న పిల్లల పరిచర్యకోసం మీ వ్యక్తిగత, కుటుంబ, సంఘ ప్రార్ధనలు కోరుతున్నాము. వీరి కోసం ప్రార్ధించండి, ఒక బిడ్డను మీరు పోషించగలిగితే వారికయ్యే ఖర్చును ప్రతినెలా మీరు పంప వచ్చును. దయచేసి ప్రార్ధించండి, దేవుడు మిమ్ములను ప్రేరేపిస్తే మీ సేవాకానుకలు పంపి సహకరించండి.

గమనిక :

చెక్కులు, డ్రాఫ్టులు పంపేవారు **SPANDANA** పేరు మీద పంపాలి. మీ దబ్బు అందగానే మీకు ఉత్తరం రాస్తాము.



వివరాలకు :

**దేవసహాయం**
**లిటిల్ ఏంజల్స్ హోమ్**
పోస్టుబాక్స్: 415, విజయవాడ - 520 002.
ఫోన్ : (0866) 2456547, 9346616347

విడి ప్రతి 10 రూ.

జనవరి 2008

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

## నేను బ్రతుకు దినములన్నియు కృపా క్షేమములే నా వెంట వచ్చును.


కీర్తన 23:5



# లిటిల్ ఏంజల్ హోమ్‌లోని పిల్లలకు అనాధ పేద పిల్లలకు క్రిస్మసు విందు, నూతన వస్త్రాలు



లిటిల్ ఏంజల్ హోమ్ పిల్లల ఏక్షన్ సాంగ్


కంద్రికలో హోమ్ దగ్గర పిల్లలకు క్రిస్మసు విందు


పిల్లలందరికీ నూతన వస్త్రాలు


చిన్నపిల్లలకు వాక్యోపదేశం


దేవసహాయం గారు, దేవానంద్ గారు


పిల్లల మరో ఏక్షన్ సాంగ్

క్రిస్మసు రోజున పేదలకు సాయపడటానికి, లిటిల్ ఏంజల్ హోం పరిసర ప్రాంతాలలో ఉన్న పిల్లలకు క్రిస్మసు విందుతో పాటు నూతన వస్త్రాలు తీయటానికి మీరు చూపిన ప్రేమ ఇచ్చిన ఆర్థిక సహకారాన్ని బట్టి వందనాలు. ఓ చిన్న సాక్ష్యాన్ని మీతో పంచుకోవాలని ఆశిస్తున్నాను.

ఆ మధ్యన ఓ ధనవంతుడయిన సోదరుడు మాట్లాడుతూ, "బ్రదర్ దేవా గారు లిటిల్ ఏంజల్‌లో పిల్లలకు క్రిస్మసుకు బట్టలు తీసివ్వటానికి కావాల్సిన డబ్బును నేనిస్తాను" అన్నాడు. నేను చాలా సంతోషపడి నేనన్నాను. "బ్రదర్ ప్రతి సంవత్సరం మా వద్ద వుండే 40మంది పిల్లలకు మాత్రమే బట్టలు తీస్తున్నాము. అయితే లిటిల్ ఏంజల్ ఉన్న ప్రాంతంలో పేద పిల్లలు చాలామంది ఉన్నారండి. కనీసం ఓ వందమందికయినా బట్టలు తీయాలని ప్రార్ధన చేస్తున్నాము" అన్నాను. "అలాగే బ్రదర్ దానికి కావాల్సిన డబ్బంతా నేను పంపుతాగా!'' అన్నాడు. నేను చాలా సంతోషపడిపోయాను. ఈ విషయాన్ని మన ఆశ్రమంలోని పిల్లలకు కూడా చెప్పి వారిని ప్రోత్సహించి ప్రతి సంవత్సరం మీరు కొత్త బట్టలు తీసుకోవటమే కాదు, ఇతరులకు కూడా మనం సాయం చేయాలి. మీకు తెలిసిన అనాథ, పేద పిల్లలు ఉంటే వారి పేర్లు ఇవ్వండి అని చెప్పాము. మొత్తానికి వందమంది పిల్లలు అనుకున్నది సుమారు 150 పేర్లయితే వచ్చినయిగాని ఈ డబ్బు పంపుతాను అన్న సోదరుని దగ్గరనుండి మాత్రం కబురు లేదు. కొన్ని ఫోన్లు చేశాను, ఉత్తరాలు రాశాను గాని జవాబు లేదు. ఈయన వెనకడుగు వేశాడని నా కర్దమయిపోయింది.

చాలా మంది ప్రియులు ప్రేమతో కానుకలు పంపుతూ ఉన్నారు గాని అవన్నీ కలిపినా బట్టలకే చాలవు. పైగా భోజనాలు, దుప్పట్లు మిగతా ఖర్చులు ఉన్నాయి. అయితే ప్రభువు తప్పక సాయం చేస్తాడన్న విశ్వాసం ఉంది. క్రిస్మసు ఇంకా కొన్ని రోజులే ఉందనగా గుజరాత్‌నుండి సోదరులు ప్రకాశ్‌గారు ఫోన్ చేశారు. గత నెలలో వారి తల్లి వర్ధంతి సంధర్భంగా సుమారు 10 పిల్లలకు బట్టలు తీయమని, పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేయమని ఓ 5 వేల రూపాయలు పంపారు. వారు చెప్పినట్టే చేశాము. ఆ విషయాలు చెబుతూ ఉండగా సోదరులు ప్రకాశ్ గారు చాలా సంతోషపడిపోయి, "మీరు క్రిస్మసుకు కూడా పిల్లలకు బట్టలు, ప్రత్యేకమైన విందు ఏర్పాటు చేస్తారు కదా, నేను మరికొంత డబ్బులు పంపుతానండి, ఎంత ఖర్చవుతుంది" అడిగారు. నేనన్నాను "ప్రతి సంవత్సరం కేవలం మన దగ్గర ఉన్న పిల్లలకే బట్టలు తీస్తున్నాము. ఈ సారి కనీసం వందమందికయినా బట్టలు తీయాలని ప్రార్థిస్తున్నాను, అయితే మీరు మొన్ననే డబ్బు పంపారు గనుక క్రిస్మసుకు మీరెంత పంపినా ఫరవాలేదు, మిగతా డబ్బు కొందరు చిన్న చిన్న మొత్తాలు పంపిస్తున్నారు, దానితో అడ్జస్టు చేయాలను కుంటున్నాను" అన్నాను. దేవునికి స్తోత్రాలు. సోదరులు "అలా కాదండి మొత్తం నేనే పంపిస్తాను అని వెంటనే కావలసిన డబ్బు పంపారు. గమనించారా? మన దేవుడు అద్భుతాలు చేసే దేవుడు. సుమారు 150 మంది పిల్లలకు క్రిస్మసు విందు, నూతన వస్త్రాలు తీయటానికి ప్రభువు కృప చూపారు. అలాగే క్రిస్మసు రాత్రి సమయంలో భోజనం ప్యాకెట్లు, దుప్పట్లు పంచటం అలాగే విజయవాడకు సమీపంలో గల కుష్టువ్యాది సోకినవారు నివసించే కాలనీలో దుప్పట్లు, చీరెలు పంచగలిగాము. సుమారు 40 వేల రూపాయలు ఈ కార్యక్రమాలన్నిటికోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. చాలా మంది ఈ సేవకు ప్రత్యేక కానుకలు పంపారు. దేవుడు మిమ్మునందరినీ సమృద్ధిగా దీవించి ఆశీర్వదించును గాక!

వెంట వెంటనే అయినా పిల్లల ప్రశస్తమైన సేవకోసం ధారాళంగా కానుకలు పంపిన సోదరులు ప్రకాశ్ గారు వారి కుటుంబ సభ్యులను దేవుడు సమృద్ధిగా దీవించును గాక! ఈ కుటుంబాన్ని మీ ప్రార్ధనల్లో జ్ఞాపకముంచుకోండి. సోదరులు ప్రకాశ్ గారు తమ తల్లి శ్రీమతి దబ్బా లలితకుమారి గారి ప్రతి వర్ధంతికి పిల్లల సేవకోసం కానుకలు పంపుతూ ఉంటారు. తమ తల్లిని ఎంతగానో ప్రేమించే పిల్లలు ప్రకాశ్ వారి సోదరులు ప్రవీణ్ గారిని బట్టి దేవునికి స్తోత్రాలు. ఈ పరిచర్య చేయటానికి కృప చూపిన దేవునికి స్తుతులు సమర్పిస్తున్నాము. ఆర్ధికంగా సహకరించిన మీ అందరికి ప్రత్యేక వందనాలు తెలియజేస్తున్నాము. దైవాశీస్సులు


లిటిల్ ఏంజల్ హోమ్‌లో క్రిస్మస్ విందు


దేవసహాయం గారితో పిల్లలు


సిబ్బందికి నూతన వస్త్రాలు


సిబ్బందికి నూతన వస్త్రాలు


దేవసహాయం దంపతులతో హోమ్ సిబ్బంది


దేవసహాయం దంపతులతో హోమ్ సిబ్బంది


'దేవునికి స్తోత్రం'


దేవసహాయం గారితో పిల్లలందరూ

# నిరుపేదలకు సహాయం

**క్రిస్మసు రోజు** రాత్రి వీధులలో రోడ్డు ప్రక్కన, చలికి కనీసం కప్పుకోటానికి దుప్పటి కూడా లేకుండా ఆకలి కడుపులతో పడుకుని ఉన్న అనేక మందికి సేవ చేయటానికి ప్రభువు కృప చూపారు. మేము ఈ సేవ చేస్తూ ఉండగా పోలీస్ పికెటింగ్ రాత్రి పూట పహారా తిరిగే పోలీస్ ఇన్‌స్పెక్టరు గారు ఒకాయన మేము చేసే ఈ సేవను ప్రత్యేకంగా గమనించారు. ఆ తరువాత రెండు రోజుల తరువాత ఓ ఆఫీసులో నన్ను చూచి గుర్తుపట్టి ఎంత అభినందించారో చెప్పలేను. "అంత రాత్రి సమయంలో ముక్కుమొహం తెలియని ప్రజలకు మీరు స్వయంగా దుప్పట్లు. భోజనాలు పంచుతూ ఉంటే మిమ్ముల్ను చూచి చాలా సంతోష పడిపోయానండి. అది చాలా గొప్ప సేవ అంటూ తన అడ్రసు ఫోన్ నంబరు ఇచ్చి మీకు ఎప్పుడు ఏది అవసరమొచ్చినా మేమున్నాము" అంటూ అభినందనలు తెలుపుతూ ఉంటే నేను ప్రభువును స్తుతించాను. సరే, ఈ సేవలో కొందరు అభాగ్యులను చూస్తే కడుపు తరుక్కపోయింది. కొందరు నిద్రపోతున్న వారిని చూస్తే ఏదో సామాను మూట కట్టినట్లుంటుంది. చలికి సిమెంట్ బస్తాల పరజాల్లో పడుకున్న వారు. కొందరు కాగితాలు కప్పుకుని పడుకున్న వారు. కప్పుకోటానికి ఏమీ లేక కడుపులోకి కాళ్లు ముడుచుకుని చెవులకు చేతులు కప్పుకుని పడుకుని ఉన్న అనేక మందిని చూచి వారికి సాయపడగలిగాము.

అలాగే విజయవాడ దగ్గరలోని లెప్రసి కాలని వాసులను దర్శించి ప్రార్ధించి వారికి దుప్పట్లు, చీరెలు పంచటానికి ప్రభువు కృపచూపారు. వారిలో కొంత మందికి ప్రతినెలా స్పందన వెడుతుంది. ఆ విషయం ముందు తెలియదు గాని అక్కడకు వెళ్లాక తెలిసింది. వీరికి ప్రతినెలా బియ్యం, నూనెలు మొ॥ నిత్యావసర వస్తువులు కావాలి. ప్రార్ధించండి. ప్రభువు వనరులు సమకూర్చిన కొలది వీరికి సాయ పడాలని ఆశిస్తున్నాము.

సహకరించిన అందరికీ వందనములు. మీ సోదరుడు దైవసహాయం


కటికనేలమీద దోమలు కుట్టకుండా తలమీద మాత్రం పాస్టిక్ షీట్ కప్పకునిఉన్న ఈ వ్యక్తిని చూచాము




సముద్రంలో చిన్న బొట్టంత ఈ సాయం! దేవునిబిడ్డలారా, ఈలాంటివారి కోసం మీరు కాకపోతే ఇంకెవరు ప్రార్ధిస్తారు? సాయం చేస్తారు? దేవుని సంఘం ఈలాంటి వారికోసం ప్రార్ధించటం మరచిపోయింది.



ఇదేంటి? ఏద్దైనా ప్యాకెట్టు అనుకుంటున్నారా? కాదు చలికి ప్లాస్టిక్ సిమెంట్ సంచులను కప్పకుని తాళ్లతో వాటిని కట్టుకుని తిండి లేకుండానే పడుకున్న ఈ కుర్రాడు మనం చేసిన ఈ చిన్న సాయానికి ఎంత సంబర పడి పోయాడో!






లెప్రసీ కాలనీలో ప్రార్ధించి దుప్పట్లు, చీరలు పంచుతున్న డా.దేవ

ఇంకా ప్రచురించాల్సిన ఫోటోలు చాలాఉన్నవి, వీలువెంట ప్రచురిస్తుంటాము.


1976 - 2008 32 సంవత్సరాలుగా దేవుని ఆహార క్రమంలో

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక

*The largest circulated Telugu monthly since 32 years*

| జనవరి 2008 | సంపుటి 32 | సంచిక 1 |
|---|---|---|

వ్యవస్థాపక, ప్రధాన సంపాదకులు : ఆచార్య ఆరార్కే మూర్తి

ప్రచురణకర్త, సంపాదకులు : డా॥ దేవసహాయం దండల

గౌరవ సంపాదకులు : డా॥ జ్ఞాన భాస్కర్,

సంపాదక వర్గం : బ్రదర్ జి. దేవరాజు, బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, రెవ. కె.జాన్‌మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్, బ్రదర్ ఆర్. భూషణం

సహాయ సంపాదకులు : బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్ అబ్రహాం


## ఈ సంచికలో


నవనూతనం
మరో మైలురాయి
నూతన వత్సరం
ఇదిగో నేనొక నూతన క్రియ
రోకలిపూజ
మహిమగల నూతన సృష్టి
క్రీస్తులో కొత్త జీవితం
ప్రార్ధనా వేదిక
గళ్లనుడికట్టు


## చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాలకు |
|---|---|---|
| 1 సంవత్సరం | రూ. 100 | $ 20 |
| జీవిత సభ్యత్వం | రూ. 1000 | $150 |
| పోషక సభ్యత్వం | రూ. 100 (ప్రతినెల) | $2 0 |

అందరికీ అందుబాటులో ఉండాలని సం. చందా రు.100 గానే ఉంచాము. వాస్తవానికి రు.150 ఖర్చవుతుంది. పత్రిక చందాకు మించి పరిచర్య అభివృద్ధి కోసం కానుకలు పంపుచున్న చందాదారులకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు, స్పందన పరిచర్య నిమిత్తం మీరు పంపే కానుకలు, చెక్కులు, డ్రాఫ్టులు, ఎం.ఓ.లు, స్పందన SPANDANA పేరు మీద ఈ క్రింది అడ్రస్‌కు పంపాలి. వెంటనే ఉత్తరం రాస్తాము


**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**

పోస్టు బాక్స్: 415, గార్లపాటివారి వీధి, దుర్గాగ్రహారం, విజయవాడ - 520 002

ఫోన్స్ : 0866 - 2456547 సెల్ : 934 661 6347

E-mail: read_spandana@yahoo.com

Founder & Chief Editor : **Acharya R.R.K.Murthy**

Printed, Published and owned by **DEVASAHAYAM DANDALA**
Printed at **Spandana Offset Printers**, Arundal pet, VJA-2. Ph:2430148,
For Spandana Graphics & Published from
# 30-3-13, Durga Agraharam, Vijayawada - 2.

# స్పందన - ప్రతి స్పందన



**ఉపయోగకరంగా :**

ప్రభువునందు సహోదరులకు వందనములు. ఎప్పుడెప్పుడు 4,5 తేదీలోస్తాయా పత్రికను చేతిలోనికి తీసుకుంటామాఅని ఎదురు చూస్తుంటాము. పత్రిక మాకెంతో ఉపయోగకరంగా వుంది. నేను చదివి యిరుగు, పొరుగువారికి అందిస్తాను. మీ కొరకు, పత్రిక కొరకు తప్పక ప్రార్థిస్తాము.

**–పి. హెచ్. మార్గరేట్, నెల్లూరు**

**ప్రోత్సాహం**

మా ఆఫీసులో పనిచేయుచున్న విజయలక్ష్మిగారు మీ స్పందన తెప్పించి చదవటమే కాక దేవుని ఎరుగని నన్ను చదవమని ప్రోత్సహించారు. పత్రిక చదువుట వలన ఎన్నో ఆత్మీయమేలులు పొందుకుంటున్నాను. కావున నేను కూడా ఈ పత్రిక తెప్పించుకొవాలని ఆశ కలిగినది. స్పందన చందా పంపుచున్నాను నాకు కూడా నెల,నెల పత్రిక పంపగలరు.

**–జి. విజయ్‌కుమార్, శ్రీకాకుళం జిల్లా**

ప్రతిమాసము మీ పత్రిక చదివి మా కుటుంబమంతయు ఎన్నో ఆధ్యాత్మిక విషయములు తెలుసుకొని సంతోషించు చున్నాము. దేవుడు స్పందన పరిచర్యలను యింకా ఆశీర్వదించి దైవజనులైన మూర్తిగారికి ఆయురారోగ్యములనిచ్చి సేవలో ఇంకను బలముగా వాడుకొనునట్లు మేము ప్రార్థించుచున్నాము.

**– టి.రాజకుమారి, ఉలవపాడు**

**చాలా బాగున్నవి :**

నవంబర్ నెల స్పందనలో దాతృత్వం గూర్చి వ్రాసిన వ్యాసములు చాలా బాగున్నవి. అవి చదివి మా చర్చిలో స్త్రీల సంఘములో మాట్లాడినాను. నేను స్త్రీల సంఘము ప్రెసిడెంటును. నేను సంఘములో యింకా బలంగా వాక్యం చెప్పగలుగునట్లు ప్రార్థించగలరు.

**–సి. హెచ్. రాజేశ్వరి, తెనాలి**

**ఆత్మీయంగా :**

స్పందన ఎడిటర్ గార్కి వందనములు. మీ పత్రిక మాకు ఎంతో ఆత్మీయంగా, ఆశీర్వాదకరంగా ఉన్నది. డిశెంబర్ నెల పత్రిక ఎంతో సుందరంగా ముద్రించారు. మీకు వందనములు.

**–యం.ఎ.సంపత్‌కుమార్, కడప**

**మార్గదర్శకంగా :**

స్పందన పత్రిక నిర్వాహకులకు వందనములు. ప్రియాతి ప్రియ ప్రభువువారి యందు మీకు గల విశ్వాసమును స్పందన పత్రిక ద్వారా క్రియారూపంగా చూపుతూ అనేకులకు మార్గదర్శకం వహిస్తున్నందులకు మీరు ఎంతో అభినందనీయులు.

**– అబ్రహాం, మాచర్ల**



సంపాదకీయం

# మరో సవంత్సరం....

ఇది క్రొత్త సంవత్సరం. గేయకారుడు చెప్పినట్లు "నేను బ్రతికే దినాలన్ని కృపా క్షేమాలే నా వెంట వస్తాయి" నిశ్చయత, నిశ్చింత విశ్వాసులకు సంవత్సరం పొడుగునా వుంటాయి.

2008 వ సంవత్సరంలో ఏమేమి జరుగుతాయో మనకు తెలియదు. కాని నడిపించేవాడు యేసుక్రీస్తు. అంచేత భవిష్యత్తును గురించిన ఆందోళన మనకు అవసరం లేదు. పరలోకపు తండ్రి నీ గురించి తలపెట్టింది జరిగి తీరుతుంది. ఆయన సదాకాలం నీతో వుంటాడు. ఈ నూతన సంవత్సరం పనిలో, ప్రతీక్షలో, అభివృద్ధిలో, స్తుతిలో, కృపలో, విశ్వసనీయతలో ఇది మరో సంవత్సరం. ప్రభువుతో గడపాల్సిన మరో యేడు. "ప్రియ యేసునిపై ఆనుకొని అరణ్యమార్గమున నడచుటయే ఆనంద జీవితం!"

సేవలో, సాక్ష్యంలో, పరిశుద్ధతలో మరో గొప్ప సంవత్సరం. క్రొత్త సంవత్సరంలో ప్రతీదీ నీకు కొత్తది కావాలి. పాతవాటిలో నిరర్ధకమైన వాటిని విడిచిపెట్టి ముందున్న వాటికోసం వేగిర పడుతూ పరిగెత్తాలి. దేవుని వాగ్ధానాలన్నీ క్రీస్తునందు నీ పట్ల అవును అన్నట్లే వున్నాయి. మీ భవిష్యత్తు ఆయన వాగ్ధానాల నెరవేర్పు దృష్ట్యా మీకెంతో వుత్సాహ భరితం కావాలని ప్రభువు నామమున మిమ్మును ఆశీర్వదిస్తూ, నిరంతరమూ మీ కోసం శ్రమించే,....

**క్రీస్తునందు భవదీయుడు**



## మనలో మాట

క్రీస్తునందు ప్రియపాఠకులకు,

మన మంచి కాపరి, గొప్ప కాపరి, ప్రధాన కాపరి ప్రభువైన యేసు క్రీస్తు దివ్య నామమున మీకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

యోహాను 10.11 లో మంచి కాపరి మన కోసం ప్రాణం పెట్టాడు. ఆయన ప్రాణం, ఆయన కార్చిన పవిత్ర రక్తం మన ప్రతి పాపాన్ని శాపాన్ని పరిహరిస్తుంది. హెబ్రీ 13.21 లో. గొప్ప కాపరి మరణాన్ని గెలిచి తిరిగి లేచి, (మత్తయి 28:20) ఈ రోజున మనతో కూడా ఆత్మరూపిగా సజీవుడుగా ఉన్న దేవుడు. 1 పేతురు 5.4 లో, ప్రధాన కాపరి మరలా ప్రత్యక్షం కానున్నాడు. మన ప్రభువు త్వరలో రానైయున్నాడు. దేవునికి స్తోత్రాలు. ఆయన రాకడకోసం మనం ఎల్లప్పడూ సిద్దంగా ఉండాలి.

ఈ నూతన సంవత్సరంలో ఈ మంచి కాపరి, గొప్ప కాపరి, ప్రధాన కాపరి మీకు తోడైయుండి మిమ్ము సమృద్ధిగా ఆశీర్వదించి, దీవించి, దేవుడు మీ జీవితాలను గురించి ఉద్దేశించిన మంచి సంగతులన్నీ మీ పక్షంగా జరిగించును గాక!

దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారి 20వ పుట్టిన రోజు (తప్ప ప్రింట్ అయింది అనుకుంటున్నారా? కాదు కరక్టే), నాలుగేళ్లకు ఒకసారి వచ్చే ఆరార్కే గారి పుట్టిన రోజు ఫిబ్రవరి 29. ఎనబై సంవత్సరాల జన్మదిన కృతజ్ఞతా సభ ప్రభువు చిత్త ప్రకారం 2008 ఫిబ్రవరి 28 న జరుగనున్నది. స్థలము, సమయం వివరాలు వచ్చే సంచికలో ప్రచురిస్తాము. ఈ సంధర్భంగా స్పందన సంచిక ప్రత్యేక సంచిక - సావనీర్ గా విడుదల చేయాలని తలస్తున్నాము. ప్రార్థించండి! దైవజనునికి శుభాకాంక్షలు చెప్పాలని ఆశపడే వారందరూ మీ ఫోటోలు, ఆరార్కే గారితో కలిసి మీరు తీసుకున్న ఫోటోలు ఏవైనా ఉంటే సిద్దం చేసుకోవాలని మనవి. మరిన్ని వివరాలు వచ్చే సంచికలో ప్రచురిస్తాము.

ఈ సంచికలో దుబాయ్ పర్యటన సేవావివరాలు, క్రిస్మసు నూతన సంవత్సర సందర్భంగా మన లిటిల్ ఏంజల్ హోంలో ఉన్న పిల్లలకు మాత్రమే గాక ఆ పరిసరి ప్రాంతాలలో ఉన్న అనేకమంది చిన్న పిల్లలకు నూతన వస్త్రాలు తీయటానికి, క్రిస్మసు రాత్రి సమయంలో వీధుల వెంట వెళ్లి, కనీసం కప్పకోటానికి దుప్పటికూడా లేకుండా పడుకున్న అనేకమందికి దుప్పట్లు, భోజనపు ప్యాకెట్లు ఇవ్వటానికి, అలాగే విజయవాడకు సమీపంలో గల కుష్టువ్యాదిగల వారు ఉండే కాలనీకి వెళ్లి దుప్పట్లు, చీరెలు పంచటానికి ప్రభువు కృప చూపారు. ఈ కాలనీలో ఉన్న వారికి ప్రతి నెలా బియ్యం, నూనెలు మొ॥లయినవి సరఫరా చేయాలని తలస్తున్నాము. మీరూ మాతో కలిసి ప్రార్థించండి. ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే మీ సేవాకానుకలు పంపి దేవుని దీవెలను సమృద్ధిగా అనుభవించండి. దైవాశీస్సులు.

వందనములతో

క్రీస్తునందు మీ సోదరుడు

**దేవసహాయం దండల**





## ఆచార్య ఆరార్కే గారి
### వీడియోలో యెషయా గ్రంథ వ్యాఖ్యానాలు

ఈ మధ్యనే దైవజనులు ఆరార్కే గారు, డా॥ దేవ గారు దుబాయ్‌లో ఉన్న తెలుగు ప్రజల మధ్య సేవజరిగించటానికి వెళ్లినపడు సోదరులు బాబు గంటా దైవాత్మ ప్రేరణతో ఒక మంచి సేవా కార్యక్రమానికి పూనుకున్నారు. అదేమంటే దైవజనులు ఆచార్య ఆరార్కే మూర్తి గారి బైబిలు వ్యాఖ్యానమంతా, ఆదికాండం నుండి ప్రకటన వరకూ వీడియోలో రికార్డు చేయాలని. ఇది చాలా ప్రశస్తమైన సేవ. ఆరార్కే గారి చక్కని తెలుగు, బైబిలును ఆత్మ పూర్ణతతో వ్యాఖ్యానం ప్రత్యక్షంగా చూడటం కోసమే గాక భావితరాల వారికి కూడా ఇది ఎంతో ప్రయోజనం కలిగిస్తుంది. అయితే ఇది చాలా వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దైవజనులు ఆరార్కే గారు ఎంతో సమయాన్ని ఇందుకోసం వెచ్చించాలి. వీడియో షూటింగ్‌కు మాత్రమే గాక దానిని బైబిలు సంబంధిత చిత్రాలతో కలిపి చేయటం చాలా ఖర్చుతో కూడిన పని. గల్ఫ్‌లో ఉన్న అనేక మంది తెలుగు ప్రజలు ఒక్కో కార్యక్రమానికి సుమారు రు.5,000 విరాళంగా ఇస్తున్నారు. స్పందన పాఠకులలో ప్రేరేపింప బడిన వారు మీ తరపున గాని మీరు ప్రేమించే మీ ప్రియుల తరపున గాని ఒక కార్యక్రమానికయ్యే ఖర్చును కానుకగా పంపాలని మనవి.

మొట్టమొదటిగా యెషయా గ్రంథాన్ని రికార్డు చేయనున్నారు. ఇప్పటికే యెషయా గ్రంథ ఉపోద్ఘాతాన్ని రికార్డు చేశారు. ఈ గ్రంథం మొత్తం 66 కార్యక్రమాలవుతాయి. ప్రార్థించండి. ఈ సేవలో పాల్గొని దైవాశీస్సులు స్వీకరించండి.



## శుభవార్త ఛానల్‌లో
## స్పందన ఆధ్యాత్మిక కార్యక్రమాలు

శుభవార్త, తొలి తెలుగు క్రిష్టియన్ ఛానల్

దేవుని మహాకృపను బట్టి తెలుగు ప్రజల ఆధ్యాత్మిక ఆశీర్వాదాల కోసం 24 గంటలూ తెలుగు భాషలో దేవుని వాక్యాన్ని, దేవుని పాటలను వీక్షించటానికి, వినటానికి ఒక మంచి అవకాశం దేవుడనుగ్రహించాడు. చాలా కాలం క్రితం స్పందన పత్రికలో ప్రచురించిన విధంగా ఈ మధ్యనే ఈ ఛానల్ ప్రారంభమయింది. ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమంది ప్రముఖులయిన దేవుని సేవకులు దేవుని వాక్యాన్ని అందిస్తున్నారు. దైవజనులు ఆరార్కే మూర్తి గారు ప్రతి ఉదయం, సాయంత్రం శుభవార్త ఛానల్‌లో మాట్లాడుతున్నారు. అలాగే ప్రతి ఆదివారం సా॥ 5గం. నుండి 5.30 వరకూ 'స్పందన' ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రసారం చేయబడుతున్నాయి. వీక్షించండి. ఈ కార్యక్రమాల కోసం ప్రార్థించండి. అనేకులకు పరిచయం చేయండి.


ఈ మాసపు ప్రసంగం

# నవ నూతనం

కొత్తక వింత, పాతొక రోత, అని నానుడి. కొత్తదనమంటే మోజుపడని మనుషులంటూ వుండరు. కొత్త బట్టలు, కొత్త యిండ్లు, కొత్త పుస్తకాలు, కొత్త కాపురం ఇంకా ఎన్నెన్నో, వీటిలో విశేషాకర్షణ వుంది. దేవుడు మానవ జీవితాన్ని పాతరోత సరుకు క్రింద జమ కట్టేశాడు. పాతది చెడిపోయింది. మరమ్మత్తు కుదరదు. కొత్తది కావాలి. ఈ సృష్టి పాతది. కొత్త భూమి, కొత్త ఆకాశం కావాలి. దేవుని వాక్యంలో ఈ కొత్తదనాన్ని గురించిన సందేశం పాఠకులకు 2008 వ సంవత్సరానికి ఎంతో ఆశీర్వాదం కాగలదు.

## కొత్తపుట్టుక :

యోహాను 1:13 చెప్పినట్లు దేవుని వల్ల పుట్టిన వారు కొత్త మనుషులు. వీరు రక్తం వల్లగాని, మనుష్యేచ్ఛవల్ల గాని పుట్టినవారు కారు. ఇది భౌతిక జన్మం కాదు. మానవుడి చిత్తం, కోరిక, ప్రణాళిక, నూతన జన్మను యివ్వజాలవు. దేవుని సంకల్ప బలంవల్ల కొత్తగా జన్మించినవారు. వీరు యేసు క్రీస్తును ప్రభువుగా అంగీకరించి, ఆధ్యాత్మికంగా పుట్టారు. వీరికి సంక్రమించిన జీవం దేవునిదే. వీరు లోపలి నుండి మారారు. నూతన జన్మ మానవుడిలో కలిగింది. మానవుడి వైఖరులను, కోరికలను, ఉద్దేశాలను పూర్తిగా మారుస్తూ వుంటుంది. కొత్త ఆధ్యాత్మిక వ్యక్తిత్వం ఏర్పడుతుంది.



ఆచార్య ఆరార్కే

పాత పుటక రద్దయి పోయింది. పాతది శరీర సంబంధమైనది. ఓ కుటుంబములో పుట్టాము. తల్లి దండ్రులకు పుట్టాము. అయితే ఈ కొత్త జన్మం వల్ల దేవుడు తండ్రి అవుతున్నాడు. ఆధ్యాత్మిక జీవం పొందు తున్నాము. దేవుని కుటుంబానికి చేర్చబడు తున్నారు. దేవుని జీవం మనకు సంక్రమిస్తుంది. సోదరీ, సోదరుడా, దేవుడిని అడుగు. ఆయనే నిన్ను కొత్తమనిషిని చేస్తాడు. క్రీస్తును నమ్మటమే తరువాయి అది నీకు



కొత్త జీవితానికి ఆరంభం! పాత రోత బతుకు గతిస్తుంది. కొత్తది వస్తుంది. నీకు కొత్త జన్మ. కనీసపు అక్కర.

## కొత్తద్రాక్షారసం :

ప్రభువు చెప్పిన వుపమానం ఒకటి మత్తయి 9:17 లో వుంది. అమోఘమైన సత్యాన్నిది పరిచయం చేస్తోంది. కొత్త ద్రాక్షారసాన్ని ఎవరైనా పాత తిత్తుల్లో పోస్తారా? కొత్త ద్రాక్షారసం పొంగుతుంది కదా! దీని ఒత్తిడికి పాతతిత్తి పిగిలిపోతోంది. ద్రాక్షరసం కాస్తా కారిపోతోంది. తిత్తిపాడై పోతుంది. కొత్త ద్రాక్షరసానికి కొత్త తిత్తి కావాలి. అప్పుడు రెండూ బాగా వుంటాయి. యేసిచ్చేది కొత్త ద్రాక్షారసం. నీవే తిత్తివి. నీవు కొత్త మనిషివి అయితేనే గాని, ఈ కొత్త ద్రాక్షారసం నీలో యిమడదు. యూదామత సాంప్రదాయాలన్నీ పాత తిత్తులు. వీటిలో కొత్త ద్రాక్షారసం పొయ్యరు. ప్రభువు అలా పొయ్యడు. ద్రాక్షారసపు తిత్తిని మొదట కొత్తది చేస్తాడు. నూతన పరుస్తాడు. ఈ విధంగా శతాబ్దాల తరబడి తిత్తులను యేసుకోసం ప్రవక్తలెందరో సిద్ధపరుస్తూ వొచ్చారు.

## తిత్తుల మర్మం :

ద్రాక్షారసం తిత్తులు గొర్రెచర్మంతో చేయబడినవి. అంచులు బిగువుగా కట్టి తిత్తి కారకుండా చూస్తారు. ద్రాక్షారసం నిలవ వున్న కొద్దీ పొంగుతుంది. తిత్తికూడా దీనికి అనుగుణంగా వ్యాకోచించాలి. కొత్తదైతే సాగుతుంది. ఉబ్బుతుంది. తిత్తి పాతగిలితే సాగదు. బిగుసుకపోతుంది. పగిలిపోతుంది. ఈ తిత్తిని నూతన పరచాలంటే మొదట నీళ్ళలో నానవెయ్యాలి. నీళ్లు అంటే దేవుని వాక్యం. తరువాత దాని మీద ఒలీవ నూనె పొయ్యాలి. నూనె అంటే ఆత్మాభిషేకం. అప్పుడు పాతది కొత్తది అవుతుంది. పరిసయ్యులు పాత తిత్తుల లాంటివారు. వీరు యేసును అంగీకరించరు. వీరి పాత విధానాలలో యేసు యిమడడు. క్రైస్తవం కేవలం కొత్తవిధానం. మన హృదయాలు పాత తిత్తుల్లాగా గట్టి పడకూడదు. వాక్యంతో పరిశుద్ధాత్మతో హృదయాలు మెత్తబడాలి. ప్రభువును లోపలికి రానివ్వాలి. యేసు అనుగ్రహించే కొత్త జీవిత విధానాన్ని చేపట్టాలి.

## విశ్వాసము, ప్రేమ :

యేసు తెచ్చిన సువార్త కొత్తది. యేసు క్రీస్తు దేవుని కుమారుడు ఆయన ఈ లోకానికి వొచ్చింది ఎందుకు? ప్రజల పాపాలను క్షమించి వారిని దేవునితో సమాధాన పరచటానికి ఆయన వచ్చాడు. యేసు నందలి విశ్వాసమే దీనికి ప్రాతిపదిక అర్హత. యేసు ప్రభువు సువార్తలో విశ్వాస ప్రేమలు నిండి వున్నాయి. అయితే పాత మత సాంప్రదాయపు తిత్తులలో ఈ కొత్త ద్రాక్షారసం పోయటానికి వీలు లేదు. కొత్త ఆరంభం కావాలి. సువార్త ఎప్పుడూ నవనూతనమే! తరతరానికీ యిది కొత్తే. ప్రతి తరం ఈ సందేశాన్ని అంగీకరించాలి. అన్వయించుకోవాలి. క్రీస్తును వెంబడించే వ్యక్తి ఓ కొత్త జీవిత విధానానికి సన్నద్ధుడు కావాలి. ఇదో గొప్ప సవాలు. ఛాలెంజి.

కొత్త దృక్పథం అలవరచుకోవాలి. మనుషులతో నీకు కొత్త సంబంధం ఏర్పడాలి. నీ సేవా విధానం గూడా కొంగ్రొత్తది కావాలి. అంతా కొత్తే! యేసు ప్రేమ, యేసు నందలి విశ్వాసం నిన్ను కొత్త వ్యక్తిని చేస్తాయి. సందేహం లేదు. నీ ఆశయాలూ, ఆశలూ, కొత్తవి అవుతాయి.

**కొత్తయజమాని :**

పాత యజమాని పోవాలి. కొత్త యాజమాన్యం క్రిందికి నీవు రావాలి. రోమా 7:4 యిదే మాట చెబుతోంది. పాత యజమాని వున్నాడే వాడు నీ పాత భర్త. అదే యూద ధర్మశాస్త్రం. అయితే నీవు క్రీస్తుతో సిలువ మీద చనిపోయావు. నీవు మృతుడివి. అంచేత ధర్మశాస్త్రంతో నీకు జరిగిన పెండ్లి సంబంధం రద్దయి పోయింది. అది యింకా నీ మీద దాష్టికం చెయ్యదు. క్రీస్తు తిరిగి లేచినప్పుడు నీవు ఆయనతో తిరిగి లేచావు. నీవిప్పుడు కొత్త మనిషివి. యేసు నీకు కొత్త భర్త. మృతులలో నుండి లేచినవాడు నీ ప్రియభర్త. నువ్విప్పుడు నీతిఫలాలు ఫలించాలి. దేవుని కోసం సత్క్రియలు చేయాలి. నీ ఆధ్యాత్మిక భర్త నీ యజమాని, నీ ప్రభువు. నీ జీవిత మిప్పుడు కొత్త మలుపు తిరిగింది. నీవు విశ్వాసివి.

**కొత్తనిబంధన :**

లూకా 22:20 లో యేసు క్రీస్తు శిష్యులతో భోంచేస్తూ, పాత్ర వారి కందించి, అన్నాడు. "మిమ్ములను రక్షించే కొత్త నిబంధనకు ఈ ద్రాక్ష రసం సంకేతం. ఈ కొత్తనిబంధన నా రక్తంతో ముద్రవేయ బడింది. మీ ఆత్మలకు మూల్యం చెల్లించటానికి కార్చబడిన నా రక్తమిది. "పాత నిబంధనలో జంతు బలులర్పించారు. యాజకులు బలిరక్తం ప్రోక్షించారు. నిర్గమ 24:8 ఇది దేవునికి మానవ పాపికి మధ్య నిబంధన. జంతుబలి రక్తం పాపాలను తొలగించ జాలదు.

యేసే పాపికి ప్రత్యామ్నాయంగా చనిపోయాడు. విశ్వాసముంచిన వారి పాపం ఈ రక్తం చేత కడగబడుతుంది. నా జ్ఞాపకార్ధమై ఈ భోజన సంస్కారాన్ని ఆచరించండి, అన్నాడు ప్రభువు. యేసు సిలువపై చనిపోయాడని మనకు పాప పరిహారమైందని జ్ఞాపకం చేసేదే ప్రభువు బల్ల. ఈ సంస్కారం మతాచారం గాదు. భక్తి వ్యాయామం గాదు. ఈ రక్తనిబంధన శాశ్వతమైనది.

**కొత్త మధ్యవర్తి :**

యేసు క్రీస్తు వచ్చాక పాత కాలపు యాజకులు మధ్యవర్తిత్వంతో పనిలేదు. ఈ కొత్త మధ్యవర్తి మెల్కిసెదెకులాగే మార్మికమైన వ్యక్తి. అప్పటి యాజకులూ, బలులూ ప్రజలను రక్షించటం అసాధ్యం. క్రీస్తే కొత్త మధ్యవర్తి. రక్షకుడు. ప్రధాన యాజకుడు. దేవుడొక్కడే. దేవునికి నరునికీ మధ్యవర్తి ఒక్కడే. ఆయనే యేసే క్రీస్తు అనే నరుడు. ఆయనను ఈ రోజే నమ్మండి. నూతన సృష్టిలో పౌరసత్వం పొందండి. మీకు నూతన సంవత్సర శుభములు కలుగును గాక!



# జీవిత యాత్రలో మరో మైలురాయి

***"మీరు నివసించిన దినములెన్నో మీకు తెలిసినవి" ద్వితి 1:46.***

ఈ జీవిత యాత్రలో వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరూ ఒక్కొక్క సంవత్సరాన్ని దాటుకుంటూ ఆ శుభదినాన్ని జన్మదినంగా సంతోషిస్తుంటారు అది వ్యక్తిగత సంవత్సరాది. ఇప్పుడు మనం క్రీస్తు శకం 2008 సంవత్సరపు మైలు రాయికి చేరాము ఇంతవరకు "యెహోవా మనకు సహాయకుడుగా వున్నాడు."(1 సమూ 7:12).దేవునికి స్తోత్రాలు! మనం ముగించింది గతం. మనం చేయబోయేది మన ముందున్నది. అంచేత గతాన్ని సింహావలోకనం చేసుకొని భవిష్యత్తు వైపు దృష్టి సారించాలి.

దేవుని వాక్యాన్ని జాగ్రత్తగా ధ్యానిస్తే ఐగుప్తు దాస్యం నుండి వెలికివచ్చిన ఇశ్రాయేలీయులు భయంకరమైన మహారణ్యములలో ప్రయాణం చేసి కాదేషు బర్నియా మైదానం చేరారు. వాగ్దాన దేశానికి చేరటానికి జాప్యం, నిర్లక్ష్యం చూపారు. పై వచనంలో అట్టి ఇశ్రాయేలు జనాంగం కాదేషు బర్నియాలో గడిపిన కాలాన్ని, యాత్రా విధానం స్మరణకు తేబడింది. కానాను దేశం వారికియ్యబడింది. కాని వారు కాదేషు బర్నియా మైదానంతో తృప్తిపడ్డారు. అలాగే అనేకమంది దేవుని బిడ్డలయినవారు అల్ప సంతోషాలకు, లోకము సంబంధిత దీవెనలకు తృప్తిపడి, ఆధ్యాత్మిక చింతన లేకున్నారు.మన పౌరస్థితి ఉన్న పరలోకాన్ని గురించిన ఆలోచన, ఆ పరమ కానానుకు పయనించుటలో నిశ్చయత లేకున్నారు.



డా॥ దేవసహాయం

2007 సంవత్సరం వెళ్లిపోయింది. 2008 సంవత్సరం వచ్చేసింది. గత సంవత్సరంలో మన ఆధ్యాత్మికంగా లేదా భౌతికంగా ఏ ఏ విషయాలలో వెనుకబడి పోయాము? అవరోధాలు ఏమిటి? బేరీజు వేసుకోవాలి. ఏ ఏ విషయాలలో తప్పి పోయామో ఆయా విషయాలలో ఈ

నూతన సంవత్సరంలో విజయం కోసం ఆత్మ దేవుని సాయాన్ని అర్ధించాలి.

బాహ్య ప్రపంచంలో శాంతి, శాంతి అనే నినాదాల మధ్య అశాంతియే వుంది కదా? పైకి కనబడే మత సహనం, ప్రజాస్వామ్య వైఖరి, వెనుక లోతుకు పాతుకుపోయిన అసహనం, అసమానత్వం దాగి లేదంటారా? ప్రపంచంలోను దేశ వ్యాప్తంగా నెలకొనివున్న పరిస్థితులు చూస్తే మనిషిలో పాశవిక ప్రవృత్తి పెచ్చు మీరుతోంది. ఈ కుహనా సంస్కృతి దొడ్డి దారిన క్రైస్తవ సంఘంలో కూడా స్థానాన్ని సంపాదించుకొన్నది.

ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయిలో ఉన్నాయి అనుకున్న సంఘాలలో సహితం లోకం పోకడ ఎక్కువగా చూస్తోన్న రోజులు. సంఘం పరిశుద్ధ గ్రంథంలోని సత్యాలకు భిన్నమైన చట్టాలకు కట్టుబడినదై సమాధానమను బంధం చేత ఆత్మ కలిగించు ఐక్యతను కాపాడుకొనక పరిశుద్ధాత్మను దుఃఖపరిచేదిగా వుంది. యిది సంఘ దైన్య స్థితికి దావాగ్ని. " ఈ విషయాన్ని రాయబారి పౌలు ఇలా స్పష్టం చేశాడు. ''అంత్య దినములలో అపాయకరమైన కాలములు వచ్చును." 2 తిమోతి 3:1 యాకోబు పత్రికలోని హెచ్చరిక మన జీవితాలకు మేల్కొలుపు. "రేపేమి సంభవించునో మీకు తెలియదు. మీ జీవమేపాటిది?" యాకోబు 4:14.

## ముందున్న వాటికోసం :

జరిగిపోయిన కాలం తిరిగి రాదు. ఆ కాలాన్ని విమర్శిస్తూ, మనల్ని మనం నిందించుకొనుట పరిపాటి. ఇలాంటి క్రైస్తవులు ఫిలిప్పి సంఘంలో వుండగా వారిని అపో. పౌలు ఈ మాటలతో తన స్వానుభవమును వివరించాడు. "వెనుక వున్నవి మరచి ముందున్న వాటికొరకై వేగిరపడుచు ...... గురి యొద్దకే పరుగెత్తు చున్నాను." ఫిలిప్పి 3:14.

నూతన సంవత్సరంలో ప్రవేశించే మనం ఆధ్యాత్మిక జీవిత ప్రగతి పథంలో కొనసాగేలాగున ఈ వాక్య భాగం ఎలా సహాయపడుతుందో గమనిద్దాం.

## 1. వెనుక వున్నవి మరవాలి. :

గత కాలంలో మన బ్రతుకులోని అవకతవకల్ను మన్నించి మనల్ను మరో సంవత్సరంలోనికి ప్రవేశింపనిచ్చాడు. దేవుడు నీ పట్ల, నా పట్ల ఎంత సహనం చూపిస్తున్నాడో తెలుస్తుంది. గడచిన కాలంలో దేవుని యెడల జరిగించిన అయిష్టమైన కార్యములకు స్వస్తి చెప్పాలి. నూతనమైన ఆధ్యాత్మిక విధానాలకు, ప్రణాళికలకు నిర్ణయాలకు రావాలి. గేయకారుడైన దావీదు రాజు ఇలా పాడి దేవుణ్ణి స్తుతించాడు. "నీకాయసకరమైన మార్గం నాయందున్న దేమో చూడుము." నిత్యమార్గంలో నన్ను నడిపింపుము." కీర్తన 139:24.



## 2. వేగిరపడుట :

ప్రతి మనిషి వినటానికి వేగిరపడే వాడుగా వుండాలని అంటున్నాడు. భక్తుడైన యాకోబు. (యాకోబు 1:19) సంఘం అనేక శాఖలుగా విస్తరించి వివిధ పేర్లతో పిలువబడుతుంది. సంఘ సత్యములు తెలుసుకొనుటలోను ఆధ్యాత్మిక జీవిత విధానంలో వేగిరపాటు లేదు. పాతపద్ధతులే. చాలా కాలంగా క్రైస్తవులమనేది ఎక్కువ. అలాంటివారిని హెబ్రీ గ్రంథకర్త ఈ వాక్యంతో హెచ్చరిస్తున్నాడు. "కాలమును బట్టి చూస్తే మీరు బోధకులుగా వుండ వలసిన వారై యుండగా .....మీకు బోధింప వలసి వచ్చెను. (హెబ్రీ 5:11). వాక్య, ప్రార్ధన, సహవాస వనరులను సమకూర్చు కొనటానికి విశ్వాసి వేగిరపడాలి. దేవుడు తన ఉచిత కృపలో యిచ్చిన ఈ కాలాన్ని కాస్తా జారవిడిస్తే కాలవే నిన్ను కాటువేస్తుంది. ఎఫెసీ 5:15 లోని హెచ్చరికను గమనించి మన భవిష్యత్తును సరిచేసుకుందాం.

## 3. గురి :

ప్రతి ఒక్కరూ ఏ పని చేసినా ఏదో గమ్యం, గురి పెట్టుకుంటారు. గురిలేని జీవితం దరిచేరని ఓడతో సమానం. గురికి రెండర్థాలున్నాయి. విశ్వాసం ద్వారా రక్షణ ఖాయం. నిరీక్షణలో పరలోక పౌరసత్వం పొందటం. కాలంలోను, నిత్యత్వంలోనూ దేవుని పర్యవేక్షణ క్రింద బ్రతుకుటయే క్రైస్తవ్యం. క్రైస్తవుడి గురి పరలోకం. మనల్ను ప్రేమించి అంధకార సంబంధమైన అధికారము నుండి విడిపించిన క్రీస్తునందు గురికలిగి వుండటమే మన కర్తవ్యం. ఈ సత్యాన్ని దావీదు రాజు ఇలా బయట పెట్టాడు. "సదాకాలం యెహోవా యందు నా గురి నిల్పుచున్నాను." కీర్తన 16:8.

## 4. పరుగెత్తుట :

అపో॥ పౌలు ఆధ్యాత్మిక జీవితం పరుగు పందెంతో పోల్చాడు. ఆధునాతన వాతావరణ లోకంలో పరుగులు తీస్తుంది. క్రైస్తవ సమాజం. ఈ పరుగులో కలిసిపోవుట ఎంత దురదృష్టకరం. క్రైస్తవుడైన ప్రతి ఒక్కరూ తన్ను రక్షించిన క్రీస్తునందున్న విశ్వాసం కాపాడుకునే పందెంలో పరుగెత్తేవాడ్ని అని గుర్తించాలి. పందెంలో పాల్గొనేది ఒక ఎత్తు. దానిలో నెగ్గటం మరో ఎత్తు. దైవిక ప్రభావం, ఆధ్యాత్మిక విలువలు విచ్ఛిన్నం కాకుండా కొనసాగాలంటే హెబ్రీ గ్రంథకర్త ఆనాటి క్రైస్తవ విశ్వాసులను పురికొల్పిన విధానాన్ని మనం పాటించాలి. "యేసు వైపు చూచుచు మన యెదుట వుంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము" హెబ్రీ 12:2.

లోకంతమే కావచ్చు, ప్రభురాకడే కావచ్చు. మనకు ఈవిగా యివ్వబడిన ఈ సంవత్సరంలో దేవుణ్ణి నిష్టూర పెట్టువాటిని విడిచి, ఆధ్యాత్మిక ఆశయాలకే వేగిరపడి, పరలోకం వైపు గురినిల్పి ముందున్న కాలంలో దైవ చిత్తాను సారంగా పరుగెత్తడానికై సిద్దపడుదుము గాక!

కవిత స్పందన

# నూతన వత్సరం

సుకవి డా॥జామి ఫ్రాన్సిస్

వచ్చింది వచ్చిందీ నూతనోత్సరం
తెచ్చింది తెచ్చింది కొత్త ఉత్సాహం
నేడెంతో సుదినం - ఈ దినం
ఈ దినం సుదినమే మన బత్రుకులో
గతవత్సరం, ఇరుకుతో ఇబ్బందిలో
కలిమిలో, లేమిలో కడగండ్లలో
కరుణామయుడు, నిన్ను, నన్ను, మనలని
నీ రేడు ఇచ్చాడు వేరొక తరుణం
ఆలోచించుకో ఆలస్యం చేయకు
ఇదే మంచి తరుణం, మించిన దొరకదు
పాత బతుక్రు త్యజించు - కొత్త బతుకు కొరకు ధ్యానించు
కొత్తయేట కొత్త బట్టలు కావు నీకు అలంకారము
కొత్త యేడు కొంగొత్త జీవితం నూతన దృక్పదం నీ కలంకారం
పాతవి గతించెను - ఇదిగో కొత్తవాయెను
అనే సూక్తి ముక్తి మార్గానికి నొంది
పౌలు రోమా సంఘానికి వ్రాసిన సూక్తి
అదే "మీ మనస్సు మారి నూతన మగుట"
నూతనత్వం మనస్సును మారుస్తుంది
మనస్సు మారిన మారు మనస్సు వస్తుంది
మారు మనస్సే మనిషికి రూపాంతరం తెస్తుంది
ఈ వత్సరం నీవు రూపాంతరం చెందుట దేవుని చిత్తం
దేవుని చిత్తం, నిత్యం అది అవస్యం
పరిశుద్ధత పరిశుద్ధాత్ముని చిత్తం
ఈ నూతన వత్సరాన్న ఏంటి నీ తీర్మానం
ఆలోచించి మంచి తీర్మానం చేయుట శోభస్కరం
కావాలి నూతన జన్మం, కావాలి నూతన జీవం
రావాలి నూతన తత్వం - కావాలి నిత్య నూతనతత్వం
తండ్రి కుమార పరిశుద్ధాత్మ తోడు నిత్య అవసరం
అనవరతం కీస్తు సన్నిధి అవసరం
సైతాను శక్తులు పారదోల్రు - అప్పుడే లభించు నూతన దీవెనలు
కొత్త సంవత్సరంలో దేవునికి ఇంపైన సువాసనగా
పార్థించే హృదయం పక్రటించే పెదవులు
పంపించే చేతులు కలిగి యుండేటట్లుగా
ఆ దేవ దేవుడు నూతన వత్సరంలో దయ చేయును గాక



# ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను

బ్రదర్ కె.అబ్రహాం

కాలం సాగిపోతుంది. అది దాని లక్షణం. అది ఎవరికొరకు ఆగదు. వారములు, మాసములు, ఋతువులు, సంవత్సరములు.... ఒకదాని వెంబడి ఒకటి సాగిపోతున్నాయి. లోకము పుట్టినది మొదలుకొని యింతవరకు... ఒకే ఒక్క దినము (యెహో 10:13) తప్ప మరి ఏ దినము ఆగిపోయిన దాఖలా లేదు. గొప్ప వారింట్లో క్రొత్త శిశువు జన్మించాడు పలకరిద్దామని గాని, దేశాధినేత ఒకరు చనిపోయాడు పరామర్శిద్దామని గాని కాలానికి తోచదు. వారి భవనాల దగ్గర క్షణం కూడా ఆగదు.... భూమి మీదనున్న సకల చరాచర సృష్టియొక్కసుఖ దుఃఖాలతో నిమిత్తం లేకుండా కాలం సాగిపోతోంది.

తనపై తుఫాను లొచ్చినా, సునామీ లొచ్చినా, భూకంపములు కల్గినా, అగ్ని పర్వతములు బ్రద్దలైనా! తనకేమీ పట్టనట్లు భూమి తన భ్రమణ, పరిభ్రమణాలు మానలేదు. కాలం గడిచిపోతోంది... పాత సంవత్సరం గతించి క్రొత్త సంవత్సరం వచ్చింది.

హృదయం నిండా ఆశతో భవిష్యత్తులోనికి తొంగిచూస్తే యౌవనస్తులకు క్రొత్త ఉత్సాహం... బరువులు, భారములు మీదపడుతున్న మధ్య వయస్కులకు క్రొత్త భారం......

ఈ కాలం యొక్క నిరంతర యానం నిరీక్షణ లేని అన్యజనులకు అయోమయం. అగమ్య గోచరం.... నిరీక్షణ గల్గిన క్రైస్తవ విశ్వాసికి నిత్య సంతోషం, పరమానందం.... ఎందుకంటే తాను ఎదురు చూస్తున్న దినం రాబోతోంది..... పరమ ప్రభువు దినం దగ్గర పడుతోంది.

క్రొత్త భూమి క్రొత్త ఆకాశం కొరకు ఎదురు చూస్తూ క్రైస్తవులందరూ, జీవముతో కూడిన శుభప్రదమైన నిరీక్షణతో సాగిపోతున్నారు.

అయితే..... "ఎవడైనను క్రీస్తునందున్న యెడల అతడు నూతన సృష్టి. పాతవి గతించెను. ఇదిగో క్రొత్తమాయెను." (2 కొరింథి 5:17).. అని వ్రాయబడిన ప్రకారము..... క్రీస్తునందున్న ప్రతి వ్యక్తి, యీ భూమి మీద నుండగానే నూతన సృష్టిగా వుంటారు. వుండాలి. సమస్తము క్రొత్తవి కావాలి.

దేవుడు సృష్టించిన ఈ సృష్టిలో సముద్రముంది. (ఆది.కాం 1:10)..... ప్రభువు తన ప్రజలకొరకు సిద్ధపరచిన నూతన సృష్టిలో సముద్రము లేదు. (ప్రక 21:1) ఈ తేడా చాలా స్పష్టంగా కనబడుతోంది.... నూతన సృష్టిలో సముద్రము లేదు.

సముద్రము భక్తిహీనతను, దుష్టత్వాన్ని సూచిస్తోంది. (యెష 57:21,22) ......

సముద్రము వైలను బురదను పైకి తేలవేస్తున్నది. సముద్రము మీద తేలిని బురద, వైల, చూసేవారి కందరికి స్పష్టంగా కనిపిస్తాయి. దానిని సముద్రం దాచుకోవాలనుకున్నా దాచుకోలేదు.

అలాగునే క్రైస్తవులుగా పిలువబడుతున్న వారు, తమలోని భక్తి హీనతను దాచుకోవాలనుకున్నా దాచుకోలేకపోతున్నారు. ఒక చోట నామకార్థస్థితి, మరొక చోట వేషధారణ స్థితి. ఈ రెండింటిలో ఏదో ఒకటి తప్పక కనబడుతుంది.

పాత సంవత్సరం గతించింది..... క్రొత్త సంవత్సరం వచ్చింది. క్రొత్త బైబిల్స్, క్రొత్త క్యాలండర్లు, క్రొత్త వాగ్దానాలు, క్రొత్త దుస్తులు..... వగైరా...... ఎన్నో కొత్తవి.... కాని వ్యక్తి, వ్యక్తిత్వం, భక్తి, విశ్వాసం, నిరీక్షణ, ప్రేమ, సహవాసం, ఆరాధన, ప్రార్ధన..... అన్నీ పాతవే ..... నూతనత్వం విశ్వాస జీవితంలో యిసుమంతైనా కనబడదు.

నూతన సృష్టికొరకు ఎదురుచూస్తున్న ప్రియమైన క్రైస్తవ విశ్వాసి, మనము భూమ్మీద నుండగానే నూతన సృష్టిగా మారాలని ప్రభువు కోరిక! సముద్రపు యొక్క లక్షణాలు ఇక ఎన్నటికిని మనలో నుండకూడదు.

అప్పుడే నూతన సంవత్సరం మనకు నూతన సంతోషంతో కూడిన నూతన అనుభవం మిగులుస్తుంది.

"ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను."...(యెష 43:9).... ప్రభువు తన ప్రజల జీవితాల్లో, ప్రతి దినము ఒక నూతన కార్యం చేయాలనుకుంటున్నాడు. వాగ్ధానము సత్యము..." ఆయన అడవిలో త్రోవలు కలుగజేయువాడు, ఎడారిలో నదులు ప్రవహింపజేయువాడు." (యెష 43:19).

మనందరి జీవితాల్లోని, అశాంతి, బాధ, క్రుంగుదల, వేదన, కొరత, కొదువ సమస్తము పోగొట్టి, నూతన సంతోషం, నూతన జీవం మనలో సమృద్ధిగా నింపగలుగుటకు ఆయన సమర్ధుడు....మన ప్రభువు నందు విశ్వాస ముంచుట ద్వారా ప్రతి దినము నూతన కార్యములు చూడగలము.

వాగ్ధానము చేసినవాడు నమ్మదగినవాడు... ఆయన యిచ్చిన వాక్యము నెరవేర్చుటకు ఆతృతపడుచున్నాడు. (యిర్మి 1:12).

"యెహోవా! సంవత్సరములు జరుగుచుండగా నీ కార్యము నూతన పరచుము!" ...... అని ప్రార్ధించుకుందాం! ఈ సంవత్సరమంతయు ప్రభువు మనకు తోడై యుండి దినదినము నూతన యనుభవములో మనలను నడిపించును గాక! ఆమేన్!

## డిశెంబర్ గనుక జవాబులు

**అడ్డం :** 1.యూదా 2. ఫరో 4.రూబేను 7.యోవాబు 10. యోనా 12. వధ 13. నాతాను 14. జలము 15. నున్నని 16. మార్కు 18. కన్నుల19. వన్య 21.యుద్ధము 23. ఇమ్మానుయేలు 24. లెమ్ము, 25. ముత్యము

**నిలువు :** 1. యూస్తు 3. రోదె 4. రూతు 5. నుతించెద 6. గువా(వాగు) 7. యోనాతాను 8.హన్న 9. లేవగా10. యోనా 11.అన్న 14.నున్నన్ని 16.మార్త 17. హెబ్రీయుడు 18. కన్య 20. వినుము 22.ముని 23.ఇమ్ము 26.కోలుము(ములుకో)



# తండ్రి నాటిన మొక్కలు





*"పరలోకమందున్న నా తండ్రి నాటని ప్రతి మొక్కయు పెల్లగింపబడును" మత్తయి 15:13.*

**చె**ట్టుకు రెండు జన్మలున్నాయి. విత్తనంగా భూమిలో చల్లబడుతుంది. అందులో నుండి మొక్కపుడుతుంది. ఆ విత్తనం మొక్కగా మొలిచిన మీదట అక్కడనుండి తీయబడి వేరొక చోట నాటబడుతుంది. ఇది రెండవ జన్మ, వృక్షముగా ఎదిగి ఫలించాలంటే ఏ మొక్కకైనా ఇదే శాస్త్రం.

సృష్టికర్తయును తండ్రియునైన దేవుని దృష్టిలో ప్రతి నరుడు భూమ్మీద విత్తనంగా వేయబడి మొలచిన మొక్కలాంటివాడు. దాన్ని ఆ చోటులోనే వుంచితే ఫలించడు. మొక్క ఫలించాలని కోరుకునే రైతు మొలచిన చోటు నుండి మొక్కను తీసి వేరొక చోట ఎలా నాటుతాడో అలాగే తండ్రియైన దేవుడు తల్లినుండి కలిగిన స్వాభావిక జన్మనుండి నరుని వేరు చేసి తన కుమారుడైన క్రీస్తునందు నాటి నూతన సృష్టిగా చేయాలని మిక్కిలి ఆశ పడుచున్నారు. ఎరిగి లేదా ఎరుగక దీన్ని ఎవరు వ్యతిరేకిస్తారో, వారు పెరికి వేయబడతారు. నరకాగ్ని పాలవుతారు. భూమ్మీద శాపగ్రస్తులవుతారు. నమ్మి బాప్తీస్మం పొందినవాడు రక్షించబడును. నమ్మని వానికి శిక్ష విధించబడును. (మార్కు 16:16) ఇదే యేసయ్య పలికిన లేఖనంలో వున్న అంతరార్ధం. మరి కుమారుని యందు నాటబడిన వారి జీవితం ఎలా వుంటుంది?

### సమృద్ధి ఆశీర్వాదాలతో తృప్తి :

యెహోవా వృక్షములు తృప్తిపొందుచున్నవి. ఆయన నాటిన లెబానోను వృక్షములు తృప్తి చెందుచున్నవి. కీర్తన 104:16. మనుష్యులు తండ్రియైన దేవుని ద్వారా కుమారుడైన యేసునందు అంటుకట్టబడి ఫలితంగా పొందే ధన్యకరమైన అనుభవాలను దృష్టాంత రూపంగా కొన్ని వందల సంవత్సరాల క్రితమే దర్శించారు దావీదు చక్రవర్తి.

"ఆ దినమున మనోహరమగు ఒక ద్రాక్షావనముండును"..... ప్రతి నిమిషమున నేను దానికి నీరు కట్టుచున్నాను. యెష 27:2 ఇదే మర్మాన్ని యేసయ్య తన మాటల్లో తేటగా వివరించారు. "నాయందు నిలిచివుండుడి.... ఎవడు నా యందు నిలిచి వుండునో వాడు బహుగా ఫలించును. (యోహాను 15:4-5).

**పరలోకపు సమృద్ధి దీవెన :**

దేవా! నీ స్వాస్థ్యం మీద నీవు వర్షము సమృద్ధిగా కురిపించితివి. (కీర్తన 68:9). కుమారుడైన యేసుక్రీస్తు రక్తము ద్వారా రక్షింపబడిన ప్రతివాడు తండ్రియొక్క స్వాస్థ్యము. మీరు మీ సొత్తుకారు. మీరు విలువ పెట్టి కొనబడినవారు (1 కొరింథి 6:20).

వర్షము మానవ ప్రయత్నం లేకుండా మనిషిపొందే విలువైన ఆశీర్వాదం. యేసును నమ్ముట ద్వారా తండ్రి స్వాస్థ్యంగా చేయబడిన వారికి పైనుండి పంపబడే అమూల్య ఆశ్చర్యకరమైన ఆశీర్వాదాలు కొన్ని వున్నాయి. అందులో మొదటిది పరిశుద్ధాత్మ వర్షం. నమ్మి బాప్తిస్మం పొందండి. అప్పుడు పరిశుద్ధాత్మ వరమును మీరు పొందుదురు. (అపో॥కార్య 2:38).


**ప్రాణాపాయ స్థితిలో దైవిక భద్రత :**

నీ కుడిచేయి నాటిన మొక్కను కాయుము. నీ కొరకు నీవు నాటిన కొమ్మను కాయుము. (కీర్తన 80:16). బైబిలులో మరొక చోట యిలా వుంది. యెహోవా అను నేను దానిని (నాటిన ద్రాక్షావనాన్ని) కాపు చేయుచున్నాను..... ఎవడును దాని మీదకు రాకుండునట్లు దివారాత్రులు దాని కాపాడుచున్నాను. (యెషయా 27:2).

లోకస్థులకున్నట్లు క్రీస్తునందున్న వారికి శ్రమలుంటాయి. మరణకరమైన రోగాలొస్తాయి. బలవంతులనుండి భయాందోళనలు ఎదురవుతాయి. ప్రమాదాలు జరుగుతాయి గాని ఆ శ్రమలలో వారు నశించిపోరు. తోటలో నాటబడిన మొక్కకు కంచె వునట్లు వీరికి యేసురక్తం కంచెగా కోటగా వుంటుంది. భూత ప్రేతాత్మల శక్తులు వీరికెంత మాత్రం హాని చేయలేవు. (కొల 1:13).

ఈ సందేశం వలన నీవు ఒప్పించబడితే నీవు వున్నచోటులో ఈ నూతన సంవత్సరంలో నీ జన్మ కర్మ పాపాలను పశ్చాత్తాపంతో దేవుని యెదుట ఒప్పుకో. క్రీస్తు రక్తం నిన్ను ప్రతి పాపమునుండి విడిపించి నీతిమంతునిగా చేస్తుంది. దేవునికి స్తోత్రం!


## పుస్తక పరిచయం



సహోదరి లిల్లీ భాస్కర్‌గారి రాసిన మరో అమూల్య పుస్తకం "సంఘంలో స్త్రీలు మాట్లాడవచ్చా?" దైవజనులు ఆచార్య ఆరార్కే, డా॥ దేవ సహాయం గారి పరిచయ వాక్కులతో వెలువడింది. సమాజంలో సంఘంలో స్త్రీ బాధ్యత ఎలాంటిదో రచయిత వివరంగా రాసారు. ప్రతి ఒక్కరూ చదవాల్సిన పుస్తకం. నేడే యం.ఓ. చేసి ఈ పుస్తకాన్ని పొందండి. **వెల 20/- (పోస్టేజి 5/- అదనం)**

**వివరాలకు**

**యన్. లిల్లీ భాస్కర్, 10 - 53 - 296, LIG 23**
నెహ్రూనగర్ కాలనీ, విశాఖపట్నం - 2, సెల్: **9290998200**




బాల స్పందన

# రోకలి పూజ

అమూల్య

**రా**మాపూరంలో భార్య, భర్త వుండేవారు. భర్త అమాయకుడు. ముక్కు ముఖం తెలియని వాళ్ళందరిని ఇంటికి పిలిచేవాడు. వంటలు వండించి పెట్టి పంపేవాడు.

అతని అమాయకత్వానికి భార్య ఎన్నో కష్టాలు పడేది. ఎదురు చెప్పలేక వండి పెడుతుండేది.

ఒక రోజు భర్త ఉదయమే ఇద్దరు చుట్టాలను ఇంటికి తీసుకొచ్చాడు. "ఎవరు వచ్చారో చూడు. వీళ్ళు మన చుట్టాలు. వీళ్ళకు కావలసిన ఏర్పాట్లు చెయ్యి. నేను ఊళ్ళోకి వెళ్ళి కోడిని కొనుక్కొని వస్తాను." అని చెప్పి బజారుకు వెళ్ళాడు.

భార్య బాగా ఆలోచించింది. వచ్చిన వాళ్ళు ఎవరో ముక్కు ముఖం తెలీని వాళ్ళు. చుట్టాలు గాదు, గిట్టాలు గాదు. వీళ్ళకి తగిన శాస్తి చేయాలనుకొంది.

ఇంటిలో వున్న రోకలికి కుంకుమ పెట్టి, పూలతో పూజ చేయసాగింది. "ఎవరైనా రోకలికి పూజ చేస్తారా? దేవుడికి చేస్తారు గానీ, ఇదేమి పూజ!" అని చుట్టాలు అడిగారు.

"మా ఆయనకు ఈ మధ్య కొంచెం పిచ్చి వచ్చింది. రోజూ చుట్టాలను ఇంటికి తీసుకొచ్చి ఆయన బజారు పోతాడు. బజారులో బాగా తాగి వస్తాడు. ఇంతలోపల నేను రోకలికి పూజచేసి రడీగా వుంచాలి. ఆయన రాగానే దాన్ని ఉపయోగిస్తాడు" అంది.

"దేనికి ఉపయోగిస్తాడు?" అని చుట్టాలు ఆశ్చర్యంగా అడిగారు. "చుట్టాల కోసం ఉపయోగిస్తాడు" అని చెప్పింది. చుట్టాలకు భయం పట్టుకుంది. "చుట్టాలు దాంతో ఏం చేసుకుంటారు" అని అడిగారు. "మా ఆయనకు పిచ్చిగదా, అది కొంచెం దిగేదాకా ఈ రోకలితో చుట్టాల నడుము విరుగ్గొడతాడు" అని చెప్పిందామె.

అమ్మ బాబోయ్! అంటూ చుట్టాలు పరుగు తీసారు. ఇంతలో భర్త బజారునుంచి కోడిని తీసుకొని వచ్చాడు. "చుట్టాలు ఏరీ?" అని అడిగాడు.

"వాళ్ళు మన రోకలిని యిమ్మని అడిగారు. నేను దానికి కుంకుమ పెట్టి పూజ చేసి ఇస్తానని చెప్పాను. ఆలస్యం అయిందని వాళ్ళు అలిగి వెళ్ళారు. నువ్వు తీసుకొని పొయ్యి రోకలిని యిచ్చిరా! పరుగెత్తు!" అని చెప్పింది భార్య.

అమాయక భర్త నిజమే అనుకొని రోకలి చేత్తో పట్టుకొని వాళ్ళ వెంట పరుగెత్తాడు. వీడికి పిచ్చి ముదిరి మన నడుముల్ని విరుగ్గొట్టడానికి వస్తున్నాడని భయపడి వాళ్లు మరీ పరుగు తీసారు. అప్పటి నుండి వాళ్ళ ఇంటికి చుట్టాల బెడద తప్పింది.

బాలలూ! అపవాది మనకెంతో పరిచయమున్నట్లు చుట్టాల రూపంలో వచ్చి మనల్ను మోసం చేస్తాడు. వాడిని మనం ఎదిరించాలి. అప్పుడు వాడు మనయొద్దనుండి పారిపోతాడు! దేవునికి లోబడి అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీ యొద్దనుండి పారిపోవును!

# బైబిలు సిద్ధాంత సత్యాలు



76వ పాఠము

## మహిమ గల నూతన సృష్టి

*"అయినను మనమాయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశముల కొరకును క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము. వాటియందు నీతి నివసించును." 2పేతురు 3:13.*

*"అప్పుడు సింహాసనాసీనుడై యున్నవాడు ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నానని చెప్పెను". ప్రకటన 21:5.*

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను". ఇది దేవుడు చేసిన మొదటి పని. దానిని గూర్చి వ్రాయబడి ఉన్నది. దేవుడు ఈ సృష్టిని పరికించినప్పుడు, తన చేతి పనిని చూచినప్పుడు ఆయన బహుగా సంతోషించినాడు ఎందుకనగా "దేవుడు తాను చేసినది యావత్తు చూచినప్పుడు అది చాల మంచిదిగ నుండెను" ఆ తర్వాత సృష్టి ఆ రీతిగానే మంచిగా ఉండిపోలేదు. పాపము ప్రవేశించి దానిని చెడగొట్టెను.

తన వాక్యములో బయలుపర్చబడిన రీతిగా దేవుడు చేసెడి చివరి కార్యము కూడా సృష్టికి సంబంధించినదే. మహిమగల నూతన సృష్టిని దేవుడు కలుగజేయును. ఇది ఆయన ఖచ్చితమైన వాగ్దానము. అది దేవుని గొప్ప విమోచన ప్రణాళికలో మహిమగల చివరి ఘట్టము. మానవుని భయంకరమైన పాపమునకు నివాస స్థలము, సాతానుడి ఘోరమైన దుర్మార్గతకు స్థావరము, మరియు నశించెడి ఈ లోకము కాలిపోయినప్పుడు, సృష్టికర్త హస్తము నూతన భూమిని సృష్టించును. ఈ లోకము కాలిపోయినప్పుడు, సృష్టికర్త హస్తము నూతన భూమిని సృష్టించును. యుగములు పరిసమాప్తియై విమోచింపబడిన తనవారు తమ నిత్య విశ్రాంతిలో ప్రవేశించునప్పుడు, తన విమోచన ప్రణాళికలో నొక భాగముగా దేవుడు చేసెడి నూతన సృష్టిని గూర్చి బైబిలు యొక్క చివరి రెండు అధ్యాయములు అద్భుతమైన వర్ణను కలిగియున్నవి.

### 1. క్రొత్త ఆకాశము మరియు క్రొత్త భూమి

1. ఇప్పటి ఆకాశము ఎట్లు గతించిపోవునో, పంచభూతములు లయమై పోయి, భూమియు దానిమీద నున్న కృత్యములు ఎట్లు కాలిపోవునో ఇదివరకటి పాఠములో మనము



చూచియున్నాము. దేవుడు వీటిని తొలగించును. ఎందుకనగా తనవారి నిమిత్తము, విమోచింపబడిన తన ప్రజలందరి కొరకు మరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచినాడు. హెబ్రీ 11:40. ప్రకటన 21:1.

2. క్రొత్త భూమి సృష్టింపబడుట

క్రొత్త భూమి దేవుని ద్వారా సృజింపబడును. యెషయ 65:17; 66:22. ఇప్పటి భూమిని అద్భుత రీతిగా సృష్టించి దానిని చూచి సంతోషించిన ఆయన తన బిడ్డలకు నివాస స్థలముగా నుండునట్లు మరి గొప్ప మహిమగల భూమిని సృష్టించును. ఆది. 1:31. అగ్ని పరీక్షకు గురైన ఈ భూమియొక్క భౌతిక పదార్థమును దేవుడు ఎంతవరకు వాడుకొనునను విషయము మనకు తెలియదు. 2పేతురు 3:12. మనకు తెలిపిన విషయమేమనగా ఆయన సృష్టింప తలపెట్టిన భూమి క్రొత్తదై యుండును. తన ప్రజలకు తగిన నివాస స్థలముగా ఎల్లకాలముండును. హెబ్రీ 12:28; ప్రసంగి 3:14.

3.క్రొత్త ఆకాశము సృష్టింపబడుట

ఆకాశమునకు భూమికి అతి దగ్గర సంబంధమున్నట్లు లేఖనము బోధించును. మన తండ్రియైన దేవుడు పరలోకమందున్నాడు. మత్తయి 6:9. తాను పరలోకమునుండి వచ్చియున్నాడని యేసు చెప్పెను యోహాను 3:13 6:62. పరిశుద్ధ దూతలు పరలోకమందు నివసింతురు. మత్తయి 22:30. సాతాను మరియు చెడు దూతలు పరలోక ప్రదేశములలో నివసింతురు. ఎఫెసీ 6:12; యోహాను 1:51. క్రీస్తు తాను కలువరిపై బలియై మరణించి సంపాదించిన విమోచనలో, పరలోక విషయములను ప్రక్షాళన చేయుట కూడా ఒక భాగమైయున్నది. హెబ్రీ 9:23. నూతన సృష్టి గావించుటలో దేవుడు ఆకాశమును శుద్ధిచేసి క్రొత్త ఆకాశమును సృజించును 2పేతురు 3:13.

4. క్రొత్త భూమిపై వాసము చేయువారెవరు?

ఎ) తండ్రియైన దేవుడు మరియు గొర్రెపిల్లయైన యేసుక్రీస్తు క్రొత్త భూమిపై నివసింతురు. దేవునియొక్కయు గొర్రెపిల్లయొక్కయు సింహాసనము పరిశుద్ధ పట్టణములో నుండును. ప్రకటన 22:1,3. దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది. ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడుగా యుండును. ప్రకటన 22:1,3. దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది. ఆయన వారితో కాపురముండును, వారాయన ప్రజలైయుందురు, దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడై యుండును. ప్రకటన 21:3, ప్రకటన 21, మరియు 22 అధ్యాములలో యేసుక్రీస్తు "గొర్రెపిల్ల" యని పిలువబడుట గమనించదగ్గ విషయము.

బి) వేవేల దూతలు అనగా దేవుని పరిశుద్ధ దూతలు అచట ఉందురు. హెబ్రీ 12:22. తమ సృష్టికర్తను మరియు గొర్రెపిల్లను వారు స్తుతించి ఆరాధించు చుందురు మరియు నిత్యత్వమంతయు వారి సేవలో నుందురు. ప్రకటన 4:8; 5:11-12; 21:12.

సి) దేవుడు యేర్పరచుకొనిన జనాంగమైన ఇశ్రాయేలీయులలో నుండి విమోచింపబడినవారు అచటనుందురు మరియు నూతన యెరూషలేములో నివసింతురు. ప్రకటన 7:3-8; హెబ్రీ 11:10,16.

డి) మానవాళిలో సకల జనములకు చెందిన వారిలో నుండి ప్రభువు విమోచించినవారు, సంఘముగా ఏర్పడినవారు, మహాశ్రమకాలములో రక్షణ నొందినవారు, వెయ్యేండ్లపరిపాలనలో తమ ప్రభువు పట్ల నమ్మకముగా నుండినవారు, "జీవగ్రంథము"లో తమ పేర్లు లిఖింపబడిన వారందరు, క్రొత్త భూమిపై నివసింతురు. జయించువారు దీనిని స్వతంత్రించుకొందురు. నూతన యెరూషలేము "మనందరికి తల్లి". ఉండబోవుచున్న పట్టణము కొరకు మనము ఎదురుచూచుచున్నాము. ప్రకటన 7:14-17, 14:13; 21:7; గలతీ 4:26; హెబ్రీ 12:22; 13:14.

## 2. దేవుని పరిశుద్ధ పట్టణము

1. పరలోకమునుండి దిగివచ్చు పట్టణము

నూతనమైన యెరూషలేము అను పరిశుద్ధపట్టణము "తన భర్త కొరకు అలంకరింపబడిన పెండ్లికుమార్తెవలె సిద్ధపడి" పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట యోహాను చూచినాడు. ప్రకటన 21:2. ఒక దూత యోహానును యెత్తయిన గొప్ప పర్వతము మీదికి కొనిపోయి, "యెరూషలేము అను పరిశుద్ధ పట్టణము దేవుని మహిమగలదైపరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట" అతనికి చూపిస్తాడు. ప్రకటన 21:9-11.

2. పట్టణమును గూర్చిన వర్ణన.

ఈ పట్టణమునకు దేవుడు శిల్పియు నిర్మాణకుడునై యున్నాడు. పట్టణమును గూర్చిన అద్భుతకరమైన వర్ణన యివ్వబడినది, దాని పరిమాణము బహుగొప్పది. పొడుగును, ఎత్తును వెడల్పును సమముగా గలది. అన్ని దిక్కులను 12,000ఫర్లాంగులు ఉండును. దీనికి పండ్రెండు పునాదులు గలవు. అమూల్యమైన నానావిధ రత్నములతో ఇవి అలంకరింపబడినవి. ఆ పట్టణపు ప్రాకారము సూర్యకాంతములతో కట్టబడినది. శుద్ధ సువర్ణముతో పట్టణము నిర్మించబడినది మరియు దాని వీధులను బంగారువి. ప్రతి దిక్కున మూడు గుమ్మముల చొప్పున ఆ పట్టణమునకు పండ్రెండు గుమ్మములున్నవి. ఒక్కొక్క గుమ్మము ఒక్కొక్క ముత్యముతో కట్టబడియున్నది.

3. దేవాలయములేని పట్టణము.

నూతన యెరూసలేములో దేవాలయము ఉండదు. సర్వాధికారియైన దేవుడగు ప్రభువును గొర్రెపిల్లయు దానికి దేవాలయమైయున్నారు. సూర్యచంద్రుల ఆ పట్టణమునకక్కరలేదు. ఎందుకనగా దేవుని మహిమయే దానిలో ప్రకాశించుచున్నది. గొర్రెపిల్లయే దానికి దీపము. పగటివేళ గుమ్మములు వేయబడవు. అక్కడ రాత్రి ఉండదు.

4. దేవుని యొక్కయు గొర్రెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును. ప్రకటన 22:1,3. తండ్రియైన దేవుడు మరియు కుమారుడైన దేవుడు నూతన సృష్టిలో యుగయుగములు రాజ్యము చేయుదురు.



## 3. నిత్యస్థితి

మానవాళిలో రక్షింపబడిన వారందరు మహిమగల నూతనసృష్టిలో ప్రవేశించుటతో, వారి చివరి మరియు నిత్యస్థితి ఆరంభమగును. ఈ స్థితికి సంబంధించిన కొన్ని గొప్ప సత్యములు గమనించవలెను.

1. అది పరిపూర్ణానందము, సంతృప్తి మరియు సంతోషముగల స్థితి. విమోచింపబడినవారి శాంతి సమాధానములను భంగపర్చునది ఏదియు ఉండదు. కీర్తన 17:15; యెషయా 35:10; 1పేతురు 1:8; ప్రకటన 21:4.

2. నూతన సృష్టి సంపూర్తిగా పాపరహితమైనదిగాను, అపవిత్రమైనదేనియు లేకుండగను ఉండును. ప్రకటన 21:8, 27; 22:15. మనుష్యుడు ఎన్నడును శోధనలకు గురికాడు. మరణము యిక ఉండదు. ఈ కడపటి శత్రువు అదివరకే నశింపజేయబడి యుండును. 1కొరి. 15:26. మరణము, దుఃఖము, ఏడ్పు, వేదన మున్నగునవన్నియు ఉండవు. ప్రకటన 21:4. అచట శాపముండదు. ప్రకటన 22:3.

3. దేవునికి మానవునికి మధ్య అతి సన్నిహిత సంబంధము ఉండును. దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉండును. ఆయన వారితో కాపురముండును. ఆయన సింహాసనము వారి మధ్య ఉన్నది. నీతి మరియు ప్రేమ గలిగి ఆయన వారిని ఏలును. అది దన్యకరమైన, తండ్రి కుమారుల సన్నిహిత సంబంధము. ప్రకటన 21:7.

4. మానవుని కొరకు నిత్య రక్షణను సంపాదించిన యేసుక్రీస్తు, రక్షింపబడిన మానవునితో ఇంకను అతి దగ్గరి మరియు మధ్యర్తిత్వపు సంబంధమును కలిగియుండును. దివ్యమైన నూతన సృష్టిలో దేవుని గొర్రెపిల్లగా ఆయన ప్రవేశించును. హెబ్రీ 5:9; 1తిమోతి 2:5-6, ప్రకటన 7:17. రక్షింపబడినవారు ఆయన ముఖదర్శనము చేయుచుందురు మరియు ఆయన నామము వారి నొసళ్ల యందుండును. ప్రకటన 22:3-4. ఆయన తనవారికి జీతమిచ్చును. ప్రకటన 22:12. తన సంఘమునకు ఈ సంగతులను గూర్చి, ఈ ప్రత్యక్షతను గూర్చి సాక్షమిచ్చుటకు ఆయన తన దూతను పంపియున్నాడు. ప్రకటన 22:16.

5. సంఘము ఇంకను క్రీస్తుతో ప్రత్యేక సంబంధమును కలిగియున్నది. మరియు పెండ్లికుమార్తెగా లేక గొర్రెపిల్ల యొక్క బార్యగా పేర్కొనబడినది. ప్రకటన 21:9. పట్టణపు పండ్రెండు పునాదులపైన గొర్రెపిల్ల యొక్క పన్నిద్దరు అపోస్తలులు పండ్రెండు పేళ్లు వ్రాయబడియుండుటమనునది, సంఘము, ప్రత్యేకించి అపోస్తలులు క్రీస్తుకు ఎంత ప్రాముఖ్యమైన వారను సంగతిని తెలియజేయుచున్నది.

6. ఇశ్రాయేలీయుల పండ్రెండు గోత్రముల నామములు పట్టణపు పండ్రెండు గుమ్మముల మీద వ్రాయబడియుండుటమనునది , నూతన సృష్టిలో సహితము ఇశ్రాయేలు తన ప్రత్యేకతను కలిగియుండునని తెలియుచున్నది.

7. పరిశుద్ధాత్మను గూర్చి చివరిసారిగా ప్రకటన 22:17లో పేర్కొనబడినది. ఆయన క్రీస్తుకొరకు తన పరిచర్యను నమ్మకముగా జరిగించి ఆయనను మహిమపర్చినాడు. యోహాను 16:14. ఇప్పుడు ఆయన తన చివరి ఆహ్వానమునిస్తున్నాడు. ప్రకటన 22:17. "అవును, నేను త్వరగా వచ్చుచున్నాను. ఆమెన్ : ప్రభువైన యేసూ, రమ్ము."

యెడతెగక ప్రార్థన చేయుడి. *1 థెస్స 5:16*

# ప్రార్థన వేదిక

**1.ఎస్.అనసూయమ్మ-బాపట్ల**
నా ఆరోగ్యం కోసం

**2.వి. విక్టోరియా- విజయవాడ**
కుమార్తె వివాహం కోసం

**3.బి. శారా ఎర్నెస్టీన్- రామచంద్రపురం**
మా కుటుంబసభ్యుల కోసం

**4.కె. కిరణ్ కుమార్- చీరాల మం॥**
తండ్రిగారి ఆరోగ్యం కోసం

**5.వీరాస్వామి గౌడ్- ప్రకాశంజిల్లా**
పిల్లల ఉద్యోగాలు,వివాహల కోసం

**6.టి. రెడ్డి ప్రసాద్‌బాబు- రాజంపేట**
మంజులత వివాహం కోసం

**7.యన్.పాల్‌విజయ్ కుమార్-విజయవాడ**
నా ఆరోగ్యం, చదువు కోసం

**8.సి.హెచ్.ప్రభుదాస్- కర్నూలు**
నా ఆరోగ్యం కోసం

**9.యం.దేవమ్మ- కర్నూలు**
నా ఆరోగ్యం కోసం

**10. జాన్ స్టీవెన్- పార్వతిపురం**
నా ఆరోగ్యం, ఉద్యోగం కోసం

**11.ఎస్. రాణి- పులివెందుల**
తల్లిగారి ఆరోగ్యం కోసం

**12.సి.హెచ్.రేచలమ్మ- బెస్తవారిపేట**
రెండవ కుమారుని కోసం

**13.బెల్లన విజయ- నెల్లిమర్ల**
రాజు, చంద్రశేఖర్‌ల చదువుల కోసం

**14.కె. జయమ్మ- కావలి**
నా ఆరోగ్యం కోసం

**15.పి. రత్నమ్మ- కొరుకొండ**
నా ఆరోగ్యం కోసం

**16.హెచ్. ప్రసన్నకుమార్,ఆలూర్**
మా కుటుంబము కోసం

**17.బి. సుశీల- గుమ్మలక్ష్మీపురం**
నా ఆరోగ్యం కోసం

**18.సీర రాము- బదంగి మం॥**
వేశ్యసాంగత్యం నుండి విడుదల కోసం

**19.టి. మధుసూదనరావు- చేబ్రోలు**
సమస్యనుండి విడుదల కోసం

**20.కె.జకరయ్య- నర్సీపట్నం**
సునీత, సంగీత వివాహముల కోసం

**21.కె. మాణిక్యం- పొన్నూరు మం॥**
నా కుటుంబము కోసం

**22.యన్.యం.సి.రాయుడు-కడప**
కుమార్తెల వివాహం కోసం

**23. యన్. మేరిభాయి- మల్కపురం**
కుమార్తె,కుమారుల కుటుంబముల కోసం

**24.యం.పి.యల్.బోసు-మండపేట**
కుమార్తె వివాహం కోసం

**25.యం. విజయభాస్కర్- యర్రగుంట్ల**
మా కుటుంబము కోసం

**26. యం. జయమణి- తూ॥గో॥జిల్లా**
నా ఆరోగ్యం, తమ్ముని ఆరోగ్యం కోసం

**27. ఎ.సువార్తమ్మ- కర్నూలు**
గృహనిర్మాణం కోసం

**28. యన్. లలితమ్మ- కర్నూలు**
నా ఆరోగ్యం కోసం

**29.కరుణకుమార్ శీలం- పామర్రు**
జోయల్ నిస్సి కోసం

**30.వై.రాజారత్నం- గుజరాత్**
సత్యవేణి ఆరోగ్యం కోసం



మారిన జీవితాలు

# క్రీస్తులో కొత్త జీవితం



షేక్ చిన్న ఖాసిం (నాదస్వర విద్వాంసులు)

నా పేరు షేక్ చిన్న ఖాసిం. మా తాత గారు డా. షేక్ చిన్న మౌలానా గారు, నాదస్వర సంగీతంలో పేరున్నవారు, అలాంటి కుటుంబములో జన్మించాను. నేను చిన్న వయస్సులోనే నాదస్వరము నేర్చుకొని నాదస్వరం, సంగీత ప్రోగ్రామ్స్ నిర్వహించేవాణ్ని సంగీతము ద్వారా పేరు ప్రఖ్యాతులు మా కుటుంబానికి ఉన్నవి అదే లోకం, అసలైన జీవితం అనుకునేవాణ్ని. 1989 నా వివాహం అయింది. నా భార్య ఎస్తేర్ అభిమున్నీ. ఆమె కూడా మహమ్మదీయ కుటుంబంలో జన్మించిన వ్యక్తి అయినా ప్రభువైన యేసును రక్షకునిగా అంగీకరించిన వ్యక్తి. ఆమె కుటుంబమంతా ప్రభువునందు విశ్వాసముంచిన వారు.

జన్మతహా నేను మహామ్మదీయుణ్ని అయినా నాదస్వర సంగీతాన్ని బట్టి ఎక్కువ పరిచయాలు, సంబంధాలు హైందవ సమాజంతో కలిగియున్నాను.

నా భార్య ఆధ్యాత్మికంగా, ప్రార్ధనా పూర్వకంగా జీవించేది. నా పాప జీవితాన్ని బట్టి ఆమె చాలా ఆవేదన పడుతుండేది. నా మనో నేత్రాలు వెలిగించబడలేదు కనుక నేను జీవిస్తున్న జీవితం సరైందేనని అనుకునేవాణ్ని. లోక సంబంధమయిన బంధకాల వలన మా దంపతుల మధ్య సమస్యలు వచ్చేవి, దాని వలన నేను దుఃఖంతో, సమాధానము లేకుండా ఉన్నాను.

నేను చేయుచున్నది నాకు ఇష్టము లేదుగాని నేను చేయగోరిన దానిని చేయక నేను ద్వేషించుచున్నదానినే చేయుటకు కారణము నాలో నివసించుచున్న పాపమే కదా! అయ్యో నేనెంత దౌర్భాగ్యుడను? ఇట్టి మరణమునకులోనగు శరీరము నుండి నన్నెవడు విడిపించును? అని పరిశుద్ధ గ్రంథమందు పౌలు భక్తుడు విలపించుచున్న ప్రకారము నేను కూడ అనేకసార్లు అడుగుతూ ఆవేదన చెందాను.

అప్పుడు నా భార్య ఎంతో ప్రేమతో బైబిల్ చదవండి. యేసుక్రీస్తును మీ సొంత రక్షకునిగా అంగీకరించండి. అప్పుడు పాపబంధకముల నుండి ఆయన మిమ్ము విడిపిస్తాడని, చెబుతూ వచ్చేది. అయితే నా హృదయము ఇదంతా కేవలము భ్రమ మాత్రమే! బైబిల్ విదేశీయుల గ్రంథము. యేసుక్రీస్తు తక్కువజాతి వారి దేవుడు అనుతప్పుడు ఉద్దేశ్యముతో క్రీస్తును, బైబిల్‌ను చూచితిని.

నా భార్య సంతోషం కోసమని అప్పుడప్పుడూ ఆమెను కొన్ని క్రైస్తవ ఆధ్యాత్మిక సభలకు తీసుకొని వెళ్లేవాడిని. నాలో ఏ మాత్రం క్రీస్తును గురించి తెలుసుకోవాలని కోరిక లేదు.
కారణం నాలో ఉన్న పాప జీవితమే!

1996 వ సం. తిరుచ్చి సమీపము నందుండిన శ్రీ రంగమను మా గ్రామ మందు ఒక నిరుపేద దైవజనుని దైవిక ప్రేమ సహవాసము నాకు కలిగింది. ఆ దైవజనునిలోని క్రీస్తు ప్రేమ నన్ను ఆకర్షించనారంభించింది. ఆయన నాకు కొంచెం, కొంచెముగా సత్యము చెప్పుటకు మొదలుపెట్టారు. నా కొరకు ఎంతో భారముతో ప్రార్థించేవారు. మా కుటుంబానికి స్నేహితునిగా ఉండి త్వరలోనే మా ఇంటిలో ఉపవాస ప్రార్ధనలు జరిపేవారు. అయితే నేను ఇష్టము లేకుండనే ఆ ప్రార్థనలో పాల్గొనేవాడను. నా పెదవులతో యేసు అని

పలుకుటకు కూడ సిగ్గుపడితిని. అయితే సుమారు పది సంవత్సరముల నుండి నా భార్య నా కొరకు కన్నీటితో చేసిన ప్రార్థన ఫలించింది.

1997 వ సం. అక్టోబర్ నెల 4వ తారీఖున తిరుచ్చిలో జరుపబడిన ఒక ఉపవాస కూటమునకు నా భార్యతో కూడ వెళ్లాను. ఆ కూటములో పాల్గొన్నపుడు నాకు తెలియకుండానే చాలా మనో భారము కలిగియున్నాను. ఆరాధన జరుగుతూ ఉంటే అందరూ దేవుని స్తుతిస్తున్నారు. అయితే నేను నాకు తెలియకుండానే ఏడుస్తున్నాను. కన్నీరు ధారలుగా వస్తున్నాయి. నేనెందుకు ఏడుస్తున్నాను? కన్నీళ్లెందుకు అంతగా వస్తునాయి? నాకే తెలియదు. అయితే ఒక విషయం నా కర్థమయింది. ఏదో ఒక దైవిక శక్తి నన్ను స్పృశించి, నన్ను నింపటం గ్రహించాను. ప్రభువు ప్రసన్నత నన్ను సంపూర్ణంగా ఆవరించింది. గొప్ప సమాధానము, శాంతిని అనుభవించాను.

ప్రార్థన అనంతరం నా భార్యతో జరిగిందంతా చెప్పాను. ప్రభువు మిమ్మును ప్రేమిస్తున్నాడు, ఆత్మ దేవుడు మిమ్ములను తాకాడు. మీరు మరెక్కువ ప్రార్థన చేయాలి, బైబిలు చదవాలి అని చెప్పింది. నాకు నవ్వు ముంచు కొచ్చింది.

ఆ మరుసటి రోజు దైవజనుడు మా యింటికి వచ్చి నాకు ఒక బైబిలును బహుమతిగా ఇచ్చారు. నాదస్వరంలో మా కుటుంబానికున్న పేరు ప్రఖ్యాతులు ఆయన తెలుసుకొని, అయ్యా మీ కుటుంబం ఈ నాదస్వర విధ్యను బట్టి ప్రపంచమంతటా గొప్ప చక్రవర్తి కుటుంబంగా ఉండటం నిజమే! అందులో అనుమానం లేదు, చాలా సంతోషం. కాని, ఈ లోకమంతటికీ ఒక చక్రవర్తి ఉన్నాడయ్యా ఆయనే యేసు దేవుడు, ఆయన్ను గురించి తెలిపేదే బైబిలు గ్రంథం. సర్వలోక జ్ఞానానికి, ఆశ్చర్య కార్యాలకు, అద్భుతాలకు, ఆశీర్వాదాలకు మూలకారణం ఈ బైబిల్ మహాచక్రవర్తి మాత్రమే! మీకు వీలున్నపుడెల్లా బైబిల్ చదవండి. ఆ ప్రభువు మిమ్ములను ఇంకా దీవించి, ఆశీర్వదిస్తాడు అని చెప్పారు.

“కుమారుడా, ప్రభువైన యేసుక్రీస్తు యూదులకును, గ్రీసు దేశస్థులకును, క్రైస్తవులకు మాత్రము దేవుడు కాదు. కుమారుడా, సర్వజనులకు తన రక్షణను దయచేయుటకు దేవుని అవతారముగా, మనుష్యకుమారునిగా ఈ లోకమునకు పంపితిని. నీవు నన్ను అంగీకరించెదవా? నీ హృదయములో నాకు చోటిచ్చెదవా? నేను నిన్ను గొప్ప జనముగా చేయుదును. కుమారుడా, నీ పేరును గొప్ప చేయుదును. నిన్ను ఆశీర్వదించెదను. నీవు ఆశీర్వాదకరముగా నుండెదవు. అబ్రాహాము ఒంటరిగా నున్నప్పుడు నేనతిని పిలిచి, ఆశీర్వదించి ఆకాశ నక్షత్రముల వలె విస్తరింపచేసితిని. నా మాటలను ఆలకించవా కుమారుడా....... ఇలాగు పరిశుద్ధాత్మ బలముగా నాతో మాట్లాడుచున్న సమయమందు నేను సాగిలపడి – అయ్యో, ప్రభువా, నన్ను క్షమించుము, నా పాప శాపములను క్షమించుము. ఇంతకాలము లోకపాపమాయన జీవితములో నా దినములను గడిపితిని. ప్రభువా, నేను ఘోరపాపిని. అయ్యో, నన్ను క్షమించుము అనికేకలు వేశాను. దాదాపు ఒక గంట సమయము ఆయన బంగారు పాదములపైపడి నా భారమంతటిని విడిచితిని. నన్ను నేను ఆయనకు అప్పగించుకొంటిని. అప్పుడు దైవిక సమాధానముతో ఆయన నన్ను నింపింది. గొప్ప దైవిక ప్రసన్నతతో నన్ను నింపెను.

1997 నవంబర్ 22న ఎంతో సంతోషముగా బాప్తిస్మము తీసుకొన్నాను.

ఇదిలా ఉండగా ఒక దినము ప్రభువు పాదముల యొద్ద పట్టుదలగా కన్నీటితో ప్రార్థించాను. తండ్రీ, పాపినైన నన్ను నీ అనాద సంకల్పమును బట్టి పాపపు బురద నుండి లేవనెత్తితివి. దేవుని నిజమైన ప్రేమ, అనురాగమంటే తెలియని నన్ను కనికరమును బట్టి ఆకర్షించితివి. ప్రభువా, నిజమైన జ్ఞానమును నీవు నాకు దయచేసితివి.

ఆయన ఆజ్ఞకు లోబడి ఆయన జీవముగల మాటలను ప్రసంగించుటకును దేవదూతలచే వాయించబడిన నాదస్వరము అను పవిత్ర వాయిద్యముతో ప్రభువు పాటలను వాయించుటకును కృపచూపిన దేవాది దేవునికి సాష్టాంగ నమస్కారములు. నా కొరకును, నా కుటుంబము కొరకును, నా సేవకొరకును ప్రార్థించవలసిందిగా వినయముగా మనవి. ప్రభువు మిమ్మును ఆశీర్వదించును గాక! ఆమేన్!!




# CALCUTTA BIBLE SEMINARY

**(Affiliated to the Senate of Serampore College And Accredited by ATA)**

Working with close cooperation with the Evangelical Church of India, Calcutta Bible Seminary offers Evangelical Training to committed young men and women desiring to serve Christ and His Church. Applications are invited for the following courses.

| | | | |
|---|---|---|---|
| B.Th. | 4 years | 12th Passed | Senate of Serampore |
| M.Div. | 3 years | Any Bachelor Degree | ATA |
| M.Div. (UP-Graders) | 2 years | B.Th degree | ATA |
| B.Th. | 3 years | 12 or 10th Passed | ATA |
| Dip.Th. | 2 years | 10th Passed | ATA |

**Ï% Spiritual Environment Ï% Qualified Teachers Ï% Computerized Library Ï% Field Ministry Ï%Well furnished Hostels Ï% Excellent Computer Lab with Internet**

**★ Last date to apply 30-04-2008 ★ For Application Form send Rs.100/- to: The Principal, Calcutta Bible Seminary, Don Nagar, Ganga Nagar P.O., 24 Parganas North, Kolkata, West Bengal – 700 132**

**Ph: 033-25671811/ 32994003, E-mail: cbseminary@yahoo.co.in**

# FAITH BAPTIST BIBLE COLLEGE

**Peechinamughal Road, P.O. Iringole - 683 548, Ernakulam Dist., Kerala.**
*Phone:* 0484 - 2203834, 2525994 *e-mail:* faithbaptist@sify.com
Visit our website: www.fbbcindia.org
Invites applications from believers for the following theological training:

| COURSE | DURATION | QUALIFICATION |
|---|---|---|
| Bachelor of Theology | 4 years | SSLC Pass |
| Bachelor of Religious Education | 4 years | SSLC Pass |
| Bachelor of Ministry | 4 years | SSLC Pass |
| Master of Divinity | 2-3 years | B.Th., B.A. or equivalent |
| Master of Religious Education | 2-3 years | B.R.E., B.A. or equivalent |
| Master of Ministry | 2 years | B.Th., B.R.E., B.A. or equivalent |
| Master of Theology | 1-2 years with M.Div., 3-4 years with B.Th. or B.A. | |

New students must arrive by June 1st, 2008.

* Six-story building: hostel for men, women * Large library with 110 Journals, etc.
* Qualified teaching staff * Excellent spiritual atmosphere
* Computers, Typewriters, Bible softwares, Internet facilities available for students

Scholarships available to the deserving students

You may download the application forms from the website or send Rs. 30/- by M.O. to: ***Registrar, Faith Baptist Bible College, Peechinamughal Road, PO. Iringole - 683 548, Ernakulam Dist., Kerala***

# MASTER'S COLLEGE OF THEOLOGY (MCT) VISAKHAPATNAM

Affiliated to Senate of Serampore College (SSC)



Offers Theological Education under Vision Natives ministry and trains Godly leaders to serve their nationals. Medium of study is English. Courses begin on June 20, 2007. Dedicated men and women above 18 years and qualified with pass in 10 +2 or its equivalent can apply.

## COURSES OFFERED


| | | |
|---|---|---|
| Bachelor of Theology (B.TH) | SSC Degree | 4 Years |
| Graduate in Theology (G.TH) | MCT Degree | 4 Years |
| Certificate in Theology (C.TH) | MCT Diploma | 3 Years |

For application & prospectus
send Rs. 75/- M.O or Demand Draft to:

**The Director, Master's College of Theology,**
5 - 7 Kommadi Road, Madhurawada, Visakhapatnam - 530 041,
Andhra Pradesh, South India, Phone : 0891-2739803 & 2526342.
e - mail: mctvizag@sify.com.




# జనవరి గళ్ళ నుడి కట్టు



**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.
2. పూర్తిచేసిన గ.ను.క. లు డిసెంబరు 20లోపు మాకందేటట్లు పంపాలి.

పూర్తి చేసి పంపిన వారి పేరు:..........................................................

చిరునామా: ..........................................................................

**అడ్డం:**

1. సిలోయములోని - - - - పడి 18 మంది చనిపోయారు. మారుమనస్సు పొందకపోతే అదే గతి అని ప్రభవు చెప్పారు (లూకాలో)
3. - - - - - -, సాంబ్రాణిని, భోళమును ఆయనకు (బాల యేసుకు)కానుకలుగా జ్ఞానులు సమర్పించిరి.
6. - - - స్వదేశములో ఘనత పొందడు. (యోహాను 4) తలకిందులు.

8. మనము సంతోషపడి ఆనందించుట - - - (పెద్ద కుమారునితో తండ్రి)

9. ఆయన కృప అంత అ- - - గా ఉన్నది. కీర్తన 103.

11. నేను ఈ అగ్ని జ్వాలలో - - న పడుచున్నాను. 'లాజరును పంపమని ధనవంతుని మనవి'.

13. ఎవరిని - - - చేయలేదు. (కొరింథీయులతో పౌలు 7 అ.)

14. దానిని - - -యుటకై వారిని హెచ్చరించుట అవసరమని తలంచితిని (2 కొరి 9 అ) తలక్రిందులు

15. పిల్లల రొట్టె కుక్కపిల్లలకు వేయుట - - - కాదు.(తలకిందులు, మధ్య అక్షరానికి వత్తు లేదు)

16. దేవుడు - -పరచిన వానిని మనుష్యుడు వేరుపరచకూడదు (పెళ్లిలో వాడే వాక్యం)

17. మా అతిశయమేదనగా, - - - జ్ఞానము ననుసరింపక.... (2 కొరింథి)

20. యూదులు శుద్ధీకరణాచారప్రకారము రెండేసి మూడేసి - - - పట్టు ఆరు రాతిబానలు అక్కడ ఉంచబడి యుండెను.(కానా పెళ్లిలో)

22. "ఈ నీతిమంతుని రక్తమును గూర్చి నేను - - - - - -" 'పిలాతు'

25. - - - - ఈయన దేవుని కుమారుడని చెప్పుకొనిరి. మత్తయి 27.

26. మన సంపాదకుని పేరు. మనందరికీ రోజూ అవసరమే!

28. యాదావంశస్తుల గోత్రముయొక్క 12వ పట్టణము (యెహోషువ 15) "రెండో అక్షరానికి గుడి పెట్టండి!"

29. - - సమాప్తి వరకు సదాకాలము మీతో కూడా ఉన్నాను. "ప్రభువు చెప్పిన మాట"

**నిలువు**

1. పట్టణపు ప్రాకారపు పునాదులలో ఎనిమిదవది. (ప్రకటనలో)

2. యేసు - - - ప్రతి పాపమునుండి మనలను పవిత్రులనుగా చేయును. (1యోహాను)

4. యోహాను ప్రేమించే ప్రియుడు (3యోహానులో)

5. ఆయన సిలువ - - - - - సంధి చేసి ... (కొలస్సి 1)

7. - - - పడి భారము మోసికొను చున్న సమస్త జనులారా నా యొద్దకు రండి.

10. - - - - -నే కోరుచున్నాను గాని బలిని కోరను. మత్తయి 9,

12. తన ఇంటికి - - - - - - - తన యావదాస్తిమీద అధికారిగాను అతని నియమించెను. (కీర్తన 105)

18. ఆకానును....ఆకోరు - - - - - తీసుకుని వచ్చిరి. (యెహోషువ.లో) తలకిందులు.

19. - - - వచ్చు వరకు నిన్ను ఎత్తుకొను వాడను నేనే (యెషయాలో వాగ్ధానము) తలకిందులు.

20. బాలయేసును ఆరాధించటానికి ' - - - -పు జ్ఞానులు వచ్చారు'

21. (ఇదికూడా తలకిందులు) ఊరు కుమారుడు. (నిర్గమ 31)

23. - -వాడు తన జీతమునకు పాత్రుడు. (1 తిమోతి)

24. అతని పేరుకు మొదట నీతికి - - - - తరువాత సమాధానపు రాజనియు అర్ధ మిచ్చునట్టి షాలేము రాజని అర్ధము.-హెబ్రీలో.

27. తూర్పున ఉన్న - -. (ఆది 12)